# దేవుడు ఏర్పరచుకొనినవారు

భక్తసింగ్

ఐదవ ముద్రణ : నవంబరు 1985 : ప్రతులు 2,000

ఆరవ ముద్రణ : నవంబరు 1990 : ప్రతులు 2,000

ఏడవ ముద్రణ : ఆగష్టు 1994 : ప్రతులు 3,000

ఎనిమిదవ ముద్రణ : ఆగష్టు ౨౦౦౦. ప్రతులు : ౩౦౦౦

పుస్తకములు కావలసినవారు ఈక్రింది అడ్రసుకు వ్రాయమనవి :

హెబ్రోను

గోల్కొండ చౌరస్తా

హైదరాబాదు – 500 020 (ఆం.ప్ర.)

S. S. GRAPHICS, Nallakunta, Hyderabad-44.

# విషయసూచిక

పేజీ నంబరు

1. లోకమునుండి ఏర్పరచుకొనెను ........................................ 1

2. ఒక సంకల్పముకొరకు ఏర్పరచుకొనెను ........................ 8

3. ఏర్పరచుకొనబడిన పాత్ర ................................................ 19

4. ఒక సాక్షిగా ఏర్పచుకొనెను ........................................... 29

5. ఆయన మహిమార్థము ఏర్పరచుకొనెను ........................ 39

6. నిత్యత్వమునకు ఏర్పరచుకొనెను ................................ 54

## 1వ అధ్యాయము

# లోకములో నుండి ఏర్పరచుకొనెను

"నేను మిమ్ములను ఏర్పరచుకొని నియమించితిని" (యోహాను 15:16). దేవుని బిడ్డలకు ఈ మాటలయందు ఒక ప్రత్యేకమైన, అద్భుతమైన అర్థము గలదు. కావున అనుదినము మనమిట్లు "ప్రభువా, ఈ మాటలు నా జీవితమందు ఈ దినము మాత్రమే కాక ప్రతిదినము కూడను సార్థకము కావలెను" అని ప్రార్థన చేయవలెను.

మనము దేవుని వలన ఏర్పరచుకొనబడిన వారమై యుండిన యెడల మన చిక్కులు, సమస్యలు ఎట్టివైనను దేవుడు తప్పక వాటికి ఒక మార్గము తెరచును. మనలో ప్రతి యొక్కరికి సమస్యలున్నవి. రక్షింపబడిన వారమైనను, రక్షణ లేనివారమైనను, విశ్వాసమందు బిడ్డలమైనను, పెద్దవారమైనను, ఆత్మీయముగా ఎదుగుచున్నను లేకున్నను, ఆత్మీయ పరిపక్వము చెందిన వారమైనను, చెందకపోయిన వారమైనను, మనము ప్రాణము విడుచువరకు ఏదో యొక సమస్య ప్రతి యొక్కరము కలిగియే యుందుము. మనము ప్రభువునందు విశ్వాసముంచినచో మన కష్టములు, చిక్కులు అన్నియు తీరిపోవునని ఏ వాగ్దానము ఇవ్వబడలేదు. ఇంతకంటె అధికమైన కష్టములు, సమస్యలు కలుగుట సాధ్యమే. అయినను "నేను మిమ్మును ఏర్పరచుకొంటిని" అను మాటలు మన ప్రతి యొక్కరికి దేవుని జవాబును కలిగి యున్నవని నా నమ్మకము. ప్రభువు మనలను ఏర్పరచుకొని యున్నాడని మనము ఎప్పుడు గ్రహింతుమో అప్పుడు ఎంత ధైర్యము, ఎంత ఆదరణ కలిగియుందుము! మన పొరుగు వారికి అంతగా తెలియదుగాని మన అంతరంగిక చెడుగు, కుళ్ళు, మన తప్పిదములు, లోపములు ఎన్ని

విధములుగా ఆయనకు దుఃఖము కలిగించినవో, సమస్తము ఆయన ఎరిగియున్నాడు. అట్లుండియు, ఎవరమైతే ఆయన రక్తముచే కడుగబడి కొనబడి యున్నామో అట్టి వారందరికి ఈ మాటలు చెప్పుచున్నాడు.

"నేను మిమ్ములను లోకములో నుండి ఏర్పరచుకొంటిని" (యోహాను 15:19). ప్రభువు ఏర్పరచుకొనిన వారికే ఈ మాటలు చెప్పబడెను. ఎఫెసీయులకు వ్రాసిన పత్రికలో పౌలు దేవుని జనులను ఏడు విధములుగా వివరించుచున్నాడు : సంఘము, క్రీస్తు శరీరము, నూతన పురుషుడు, దేవుని కుటుంబము లేక దేవుని ఇంటివారు, దేవుని చేతిపని, ఒక పరిశుద్ధ ఆలయము, క్రీస్తు పెండ్లికుమార్తె. ఎఫెసీ. 1:22లో తన జనులను "సంఘము" అని దేవుడేల అనుచున్నాడు? "సంఘము" అను దానిని గ్రీకు భాషలో "ఎక్లిసియా" అనుచున్నారు. ఇది ఒక ప్రత్యేక అర్థము కలిగియున్నది. నూతన నిబంధన వ్రాయబడిన మూలభాష గ్రీకు భాష. "నేను మిమ్మును లోకములో నుండి ఏర్పరచుకొంటిని" అని దాని పొగుచేసి తీసుకొంటిని." ఇదొక బలమైన మాట "ఒక స్నేహితుని ఏర్పరచుకొనినట్లు మిమ్ములను ఏర్పరచుకొంటిని" అని దాని భావము కాదు; ప్రభువు ఉపయోగించిన పదము మూలభాషలో ఇట్లు అర్థమిచ్చుచున్నది "నేను అధిక శక్తితో మిమ్ముల నీడ్చి వేసితిని" లేక "లాగివేసితిని." అనగా, ఆయన లోకములో నుండి మనలను లాగివేయుటలో తన మహాబలమును ఉపయోగించవలసి యుండెను. ఈ అర్థము ఎక్లిసియా అను గ్రీకు మాటలో ఇమిడియున్నది.

ఒక ఊబిగల ప్రదేశములో నీవు వెళ్ళుచున్నావని భావించుము. అంతయు పచ్చికతో కప్పబడి యుండుటచేత గట్టి నేలవలె కనబడెను. కాని క్రిందంతయు బురద. అందుచేత అడుగు అడుగునకు నీవు అంత కంతకు లోతుగా దిగుచున్నావు. పైకి వచ్చివేయుటకు నీవు ప్రయత్నములు చేసిన

కొలది లోపలకే దిగబడి పోవుచున్నావు. ఈ పని ఒక ఏనుగు చేసినది అనుకొందము. బయటికి వచ్చుటకు ఆ మహా జంతువు కొట్టుకులాడిన కొలది లోపలకే వెళ్ళుచున్నది. దానిని పైకి లాగి వేయుటకై ఇతర ఏనుగులు ఆ ఊబిపై నడువగా, అవన్నియు కూడ మొదటి దానివలె ఆ బురదలో మునిగిపోక తప్పదు. లేక ఆ చుట్టుప్రక్కల కాపురముండు జనులు, ఆ మొదటి ఏనుగు విషయము పరితాపమొంది దానిని బయటికి తీయ ప్రయత్నించిరి అనుకొందము. వారందరికి కూడ ఏనుగు యొక్క గతియే సంభవించును. "జిగటగల దొంగ ఊబి" యొక్క లక్షణమిదే. కీర్తన 40:2లో ఈ పదమే ఉపయోగింపబడి యున్నది. పాపి యొక్క స్థితిని లేఖనము ఈ విధముగా వర్ణించుచున్నది. దేవుని వాక్య ప్రకారము 'పాపి' దొంగ ఊబిమీద నడుచుచు, జిగటగల బురదలో దిగజారి పోవుచున్నాడు.

తన పాపమును గూర్చిన దుఃఖకాలమొకటి ప్రతివాని జీవితమందు వచ్చుచున్నది. యౌవనమునందో, మధ్యకాలమందో, ముదిమియందో అప్పుడిట్లు తీర్మానించుకొనును: "మారిపోవడానికి రేపటినుండి గట్టి ప్రయత్నం చేస్తాను. ఇంతకంటె కొంచెము మంచివానిగా జీవించాలి." అయ్యో, పాపం! అతడు ఆ తీర్మానము చొప్పున ప్రయత్నించిన కొలది మరింత పాపములో దిగుచున్నాడు. ఇది మానవ స్వభావము. ఇతరుల కడకు పోయి వారి సహాయమేమైనా ఇతడు కోరినచో వారు కూడ అపజయమే పొందుట చూచును. వారు, ఇతడు అంతా కలిసి జిగటగల ఊబిలో అంతకంతకు లోతుగా దిగిపోవుదురు. వారిని పైకి లాగివేయునట్టి ఏ మానవ శక్తి లేదు.

పాపమనెడు జిగటగల ఊబిలో నుండి పైకి లాగుటకు శక్తి గలవాడు ప్రభువైన యేసుక్రీస్తు ఒక్కడే. ఈ కార్యము చేయుట కొరకే ఆయన ఈ లోకమునకు వచ్చెను. కేవలము ఈ అర్థముతోనే "చర్చి" అను పదమును

అయన ఉపయోగించెను. అనగా లాగివేయబడిన, బయటికి తీయబడిన, లేక ఎర్పరచుకొనబడిన ప్రజలు, అయన మనలను ఏర్పరచుకొనినట్లు ఋజువు మన జీవితములో ఎప్పుడు ప్రత్యక్షమగుననగా, ఆయన తన పైకి లాగుశక్తిని ఉపయోగించిన తరువాతనే. ప్రభువు నిన్ను ఏర్పరచుకొని యున్నాడా? "ప్రభువు నన్ను ఏర్పరచుకొన్ని యున్నాడు" అని చెప్పగలుగుటకు నీకు లోపల నమ్మకమున్నదా? దీనికి ఋజువు నీ జీవితమేయని చెప్పగలవా?

ఆయునచే ఏర్పరచుకొనబడుట అనగానేమి యని నీవు తెలిసికొనగోరినచో ముందుగా నీవు "లోకము" అనగానేమి యని గ్రహించవలయును భూమిమీద నీవేమి చూచుచున్నావో అవన్నియు గతించిపోవును - "ఆకాశమును భూమియు గతించునుగాని నా మాటలు ఏ మాత్రమును గతింపవు" (మత్తయి 24:35). కదల్చబడజాలనివి మాత్రమే నిలుచును. గతించి పోవువాటిని 'లోకము' అని బైబిలు తెలుపుచున్నది. సూర్య, చంద్ర తారాదులు కూడ గతించిపోవును. అయినను గతింపనివి కూడానున్నవి. "నిశ్చలమైన రాజ్యము"లో మనలను ప్రవేశపెట్టు నిమిత్తమే మన ప్రభువు మనలను ఏర్పరచుకొని యున్నాడు (హెబ్రీ. 12:28). క్రీస్తుయేసు నాధుడు నిన్ను ఏర్పరచుకొని యుండిన ఎడల నీవు కలిగియున్న వాటిలో నిలుచునవి ఏపాటివి? గతించునవి ఏ పాటివి? బ్యాంకులో నీకెంత ద్రవ్యమున్నది, నీకెంత ఆస్తియున్నది, నీకు ఏపాటి బైబిలు జ్ఞానమున్నది అని మాతో చెప్పమనుట లేదు. బైబిలు జ్ఞానము కలిగియుండుట ఎంత మేలైన సంగతియైనను దానిని మరచిపోదుము. మన పుణ్య క్రియలు నిత్యమును నిలిచియుండవు. అసలు మన మంచితనమే సదా ఉండిపోవునది కాదు. జీవించిన కొలది మన స్వభావము మారుచుండును. మనమంతా బలహీనతలతో నిండియున్నాము. మన కాలమును, బలమును గతించి పోవునట్టి వాటిమీద వ్యర్థపరచుచున్నాము. ప్రభువు మనలను ఏర్పరచుకొని

యున్నాడని ఎప్పుడు గ్రహింతుమో అప్పుడు ఎంతో అశాశ్వతమైన లోకములో మనము నివసించుచున్నామనియు మరియు నిజమైన ఆనందమిచ్చునది అందేమియు లేదనియు గ్రహింతుము. లోకములోని సర్వమును అంతకంతకు లోతుగా మునిగి పోవునట్టి జిగటగల దొంగ ఊబియని అప్పుడు తెలియును. యేసుక్రీస్తు ప్రభువు ఇట్లనుచున్నాడు : "నేను మిమ్మును లోకములో నుండి ఏర్పరచుకొంటిని." మనలను ముంచి వేయుచున్న లోక మాయలనుండి, ఆకర్షణ నుండి మనలను పైకి లాగివేసి రక్షించి, నిరంతరము నిలుచు ధనమును ఇచ్చుటకే ఆయన వచ్చెను.

ప్రభువు ఇట్లు కూడ చెప్పుచున్నాడు : "మిమ్మును నా స్నేహితులుగా చేయుటకే నేను మిమ్మును లోకములో నుండి ఏర్పరచుకొంటిని" (యోహాను 15:16,19)

ఈ మాటలు ఆయన అపొస్తలులతో మాత్రమే చెప్పటలేదు. "నా స్నేహితునిగా చేయుటకు నిన్ను నేను ఏర్పరచుకొని యున్నాను" అని నీతోను, నాతోను కూడా చెప్పుచున్నాడు. పాపములోను, అంధకారములోను జీవించుచున్న పాపి దేవునికి స్నేహితుడు కాగలడా? దైవ జీవమును కలిగియున్నవారు మాత్రమే ఈ మాటలు గ్రహింపగలరు. "నేను నా తండ్రి వలన వినిన సంగతులన్నియు మీకు తెలియజేసితిని" అని ఆయన చెప్పెను. మనము ప్రభువైన యేసుక్రీస్తు యొక్క స్నేహితులమని సర్వలోకమునకు ఋజువు పరచగలము. ఎట్లు? పరలోక దూతలకు సహితము మరుగుపరచబడిన మర్మములు సత్యములు దినదినము మనకు వెల్లడి చేయబడుచున్నవి.

మనము దేవునితో నడుచుటకు ప్రారంభించి, ఆయనతో మాట్లాడు రహస్యమును నేర్చుకొని, ప్రతిదినము ఏదో ఒక క్రొత్తది ఆయన యొద్ద

నుండి పొందుచున్నకొలది, ప్రభువైన యేసుక్రీస్తు ఇవన్నియు మనకు బోధించును. బడిపంతులుగాని కాలేజి ప్రొఫెసరుగాని, మరి ఎవరైనను గాని ఇట్టి సంగతులు మనకు బోధింపజాలరు. మత్తయి 16:17లో ఒకని గూర్చి చదువుచున్నాము. ఇతడు మూడు సంవత్సరములుగా ఆయనతోనే ఉండి ఆయన చేసిన అద్భుత కార్యములన్నియు చూచుచు, ఆయన బోధలన్నియు వినుచుండెను. ఇతడు యధార్థముగానే ప్రభువుతో ఇట్లు చెప్పగలడు : "నీ విషయము సమస్తము నేనెరుగుదును. ఎందుకంటె నీతోనే కదా నేనుంటిని మాట్లాడితిని, భుజించితిని, నిద్రించితిని" అయినను ప్రభువు ఏమను చున్నాడు? "సీమోనూ, పరలోకమందున్న నా తండ్రి ఈ సంగతి నీకు బయలు పరచెనేగాని రక్త మాంసములు నీకు బయలుపరచలేదు".

దేవుని జీవము నీలోనికి రాగా, నీవిట్లు చెప్పగలుగుదువు : "సాక్షాత్తు దేవుని జీవమే సర్వదా సమృద్ధిగా అయననుండి నాలో ప్రవహించుచున్నందున ఆయనను నేనెరుగుదును. ఆయన చిత్తమును, ఆయన సంకల్పమును, ఈ జీవమే నాకు వెల్లడి చేయుచున్నది. ఆయన నన్ను రక్షించినను లేక దండించినను ఆయన నన్ను ఏర్పరచుకొని యున్నాడని నేనెరుగుదును ప్రభువు నన్ను ఏర్పరచుకొనుట, లోకము తన దయ పొందిన వారిని ఏదో కొన్ని రోజులకే ఏర్పరచుకొనునట్లు కాదు." ఈ నిదర్శనము చూడుము. యౌవనస్థుడొకడు ఒక బాలికను అత్యంత ప్రేమతో ప్రేమించుచున్నందున ఆమెను పొందనిదే తాను జీవించజాలడని తలచి ఆమెను వివాహమాడుచున్నాడు. కొద్ది మాసములలోనే ఆ వివాహమును గూర్చి దు:ఖింప మొదలుపెట్టుచున్నాడు. మనుష్యుని మనస్సు మారుచుండును. ఎల్లప్పుడు ఒకేరీతిగా నుండదు. ఇది దేవుని పద్ధతి కాదు. ఆయన శాశ్వతముగా నిత్యత్వమునకు ఏర్పరచుకొనును. మనము ఆయన యెడల తప్పుదుము. ఆయనను దు:ఖపరుతుము. కాని ఆయన ఏర్పరచుకొనిన విమ్మట ఏ

మాత్రమును మార్పు చేయడు.

దేవుడు మనలను ఏర్పరచుకొని యున్నాడు. ఒక సంకల్పము కొరకు ఏర్పరచుకొనెను. ఆ సంకల్పము నిమిత్తము మనలను ఎట్లు తయారు చేయవలెనో ఆయన ఎరుగును (యెషయా 49:3). దేవుడు అనేక పర్యాయములు యాకోబును గద్దింపవలసి వచ్చెను. అయినను యాకోబును ఏర్పరచుకొని యుండెను. ఆ ఏర్పరచుకొనిన కార్యమును ఎన్నటికి మార్చి వేయలేదు. ఏర్పరచుకొనిన పాత్ర యొక్క రూపమునకు యాకోబును తెచ్చువరకు దేవునికి పెక్కు సంవత్సరములు పట్టెను. ఆయన ఎంతో ఓపిక పట్టెను. దేవుడేమైన యాకోబుతో : "యాకోబూ నీవెందుకు పనికిరావు. నేనే పొరబాటు పడితిని. నీ విషయము ఆశ పెట్టుకోవడము అంతా వ్యర్ధమే? ఇంకేమి లాభము లేదనెనా?" దేవుడిట్లు చెప్పలేదు. అతనిని గద్దించుచు, శిక్షించుచు యాకోబు ఇశ్రాయేలుగా మారిపోవు వరకు అతనిని తయారు చేయుచుండెను. అతడు జన్మించుటకు పూర్వమే దేవుడు యాకోబును ఏర్పరచుకొని యుండెను. దీనిని ఎన్నటికి మార్చివేయలేదు. నీవు ఎవరివైనా అయి యుండవచ్చును. నీ పొరుగు వారికి నీలో కనబడు సాక్ష్యము భయంకరముగా నుండవచ్చును. నీ స్నేహితుల ఎదుటనే నీ తల్లిదండ్రులు "వీడు బాగుపడడము వట్టిమాట; అసలు దేనికి పనికిరాడని" నిన్ను గూర్చి అనవచ్చును. అయినను దేవుడు నిన్ను తీసిపారవేయడు. నీవు నిజమైన విశ్వాసివై యుండినచో ఆయన ఇంకను నీతో ఇట్లనుచున్నాడు ... "నా బిడ్డా; నేను నిన్ను ఏర్పరచుకొని యున్నాను. నీవేమో నన్ను దు:ఖపరచుచున్నావు. నా యెడల తప్పి పోవుచున్నావు. అయినప్పటికి నేను నిన్ను ఏర్పరచుకొని యున్నాను."

ఆదికాండము 28:15లో దేవుడు యాకోబుతో; "నిన్ను నేను విడువనని" అనుచున్నాడు. నీవు ఆయనను విడువవచ్చును. "దేవునికివ్వడానికి

నాకు సమయము లేదు. నేను ఇంతకంటెను డబ్బు గడించుకోవాలి భార్యాబిడ్డల పోషణకు చేయవలసిన ఏర్పాట్లు చేయాలి. లోకములో ఒక పేరు సంపాదించుకోవాలి. ఒక వ్యాపారము నా మీద పడియున్నది. అది చాలా ముఖ్యమైన వ్యాపారము. ఇవన్ని చూచుకొనునప్పటికి ఇంకా బైబిలు చదువడానికి, ప్రార్థన చేయడానికి సమయము ఎక్కడున్నది?" అని నీవనవచ్చును. ఇట్టి వాటివలననే దేవుని ఎడల చల్లారిపోతివి. అయినను "నీవు నన్ను విడువవచ్చును. నేను మాత్రము నిన్ను విడువను. నిత్యత్వమునకు నిన్ను ఏర్పరచుకొని యున్నానని" ప్రభువు ఇప్పటికిని నీతో ఇట్లనుచున్నాడు. ఎంత ప్రేమ! ఎంత కృప! ఎటువంటి రక్షణ!

## 2వ అధ్యాయము

# ఒక సంకల్పము కొరకు ఏర్పరచుకొనెను

"యెహోవా, నీవు ఏర్పరచుకొనిన వారి క్షేమము నేను చూచుచు నీ జనులకు కలుగు సంతోషమును బట్టి నేను సంతోషించుచు నీ స్వాస్థ్యమైన వారితో కూడి కొనియాడునట్లు నీ ప్రజల యందు నీకున్న దయ చొప్పున నన్ను జ్ఞాపకమునకు తెచ్చుకొనుము; నాకు దర్శనమిచ్చి నన్ను రక్షింపుము." (కీర్తనలు 106:4,5)

ఈ మాటల ద్వారా మనకు చెప్పుటకు దేవుడు ఏదో ఒకటి కలిగియున్నాడని నా నమ్మకము. మోకరించి నీకు నీవే ఆ మాటలు చదువుము. విశ్వాసముతో చదువుము. తిరిగి తిరిగి చదువుము. మీ

అవసరము ఏమైయుండినను ఇట్లు వాటిని చదువుట వలన నీ హృదయమందొక మార్పు కలుగుచుండుట చూతువు మనలో ఆత్మీయ వాంఛను మేల్కొలుపుటకు, ఎన్నో పరిస్థితులను సందర్భములను దేవుడు ఉపయోగించును. మనలో నిజముగా దేవుని కొరకు ఆశించుటగాని, ఆకలిగొనుటగాని స్వాభావికముగా అనేకులకు లేదు. అనేకులు మనలో దేవుని తలచునది ఎప్పుడనగా, మనకేదో కావలసినప్పుడు లేక ఆపదలో, కష్టములో, వ్యాధిలో, దారిద్ర్యమందు చిక్కుకొనినప్పుడే. ఆయన సహవాసమును ఆశించి, ఆయన దగ్గరకు వెళ్ళుటలేదు. నశించునట్టి భూసంబంధమైనవి ఏవో కావలసినప్పుడే ఆయనను చేరుదుము. అయ్యో! మనలో అనేకుల హృదయములో ఉండు ఆశలన్నియు నిజ విలువలేని, నశించునట్టి వాటి కొరకే.

ప్రారంభమందు మనము చిన్నపిల్లల వంటి తలంపుల చేత ఈడ్వబడి, చేయునది ఎరుగకుందుము. దృష్టాంతముగా : పుట్ట గొడుగులు అందరు చూచినవే. అవి సాధారణముగా ఇసుక ప్రదేశములందు దొరుకును. వర్షము కురియగా ఒక్క రాత్రిలోనే ఇవి లేచును. "పుట్టగొడుగుల లాగున లేచు చున్నవి" అని ఒక సామెత కూడా చెప్పుదురు. మా చిన్నతనమందు వర్షము పడినప్పుడు పుట్ట గొడుగుల కొరకు మేము బయలుదేరి నాలుగు అయిదు మైళ్ళుకూడ వాటిని ఏరుకొనుటకు నడుచుచు పోవుచుంటిమి. ఒకనాటి ఉదయమున తెల్లని పుట్టగొడుగులు విస్తారముగా కనబడెను. నా కులాస ఏమని చెప్పను? నా గంపను వాటితో నింపివేసి, ఇంటికి తీసుకపోయి, మా తల్లితో ఇట్లంటిని - "అమ్మా ఎన్ని పుట్టగొడుగులు దొరికినవో చూడు, ఉల్లి గడ్డలు వేసి వీటిని వంట చేశావంటే, ఈ దినము మనకు విందే." మా తల్లి గంపలో చూచెను. ముందు ఒక ముక్కను తీసి చూచి, దానిని విసిరివేసెను. మరొకటి, మరొకటి, రెండు మూడు తీసి చూచి అట్లే పారవేసెను. అప్పుడు

మా అమ్మ నాతో ఇట్లనెను. "ఎంత మోసపోతివి నాయనా! ఇవి పుట్టగొడుగులు కానేకావు. వాటిలాగే కనబడినవిగాని, ఇవి పుట్టగొడుగులు కావు. ఇవి తినకూడదు."

దేవుని సంబంధమైన విషయములను గ్రహించనివారు ఇట్లే పై రూపములను చూచి మోసపోవుచున్నారు. మరియు మోసమైన వాటిని నమ్మినట్లు కూడా తెలిసికొనుటలేదు. లోక సంబంధమైన వాటికే సమయమును, ద్రవ్యమును, శక్తిని ధారబోయుచున్నారు.

నీ సంగతి ఎట్లు? దేవుని సంబంధమైన వాటి యొక్క నిజ విలువను ఆమోదించితివా? నశించెడు వస్తువుల కంటెను కూడ దేవుని సంబంధమైన విషయములకు నీకు ఆకలిదప్పులు అతి విస్తారముగా నున్నవని సత్యముగా చెప్పగలవా? దేవుని వైపునుండి లాగివేయునట్టి ఏదో కోరిక, వాంఛ, ప్రతి హృదయమందు కూడ నున్నవి; అయ్యో! ఏ ఆత్మీయ వాంఛనైతే గాయకుడు ఈ మాటల ద్వారా వెలిబుచ్చుచున్నాడో "నన్ను జ్ఞాపకమును తెచ్చు కొనుము" అనుచు, ఆ కోరికనే మనకిమ్మని మనలను ప్రేమించుచున్న దేవునికి ఎడతెగక ప్రార్థించుదుము గాక. మనలో దేవుని తెలునుకొనవలెనను కోరికను బయలుపరచుటకు ఎంతో దీర్ఘమైన ప్రార్థన అవసరము లేదు, ఒక్కటే అవశ్యకము. అది కేవలము సామాన్యమైన విశ్వాసమే.

ఒక చిన్న బాలుడు పాఠశాల యందు ఇంగ్లీషు నేర్చుకొనుచుండెను. అనగా ఎ, బి, సి మొదలైన అక్షరములే. ఒకనాడు ఇట్లు ప్రార్థన చేయునారంభించెను : "ప్రభువా, ఎ, బి, సి, డి" ఒక్క క్షణము ఆగి, తిరిగి "ఇ, ఎఫ్, జి, హెచ్, ఐ, జె, కె, ఎల్, ఎం, ఎన్, ఒ, పి, క్యు ..." ఇట్లు సాగించెను. అతని ప్రార్థనను ఆపుచు, తల్లి ఇట్లనెను : "బాబూ ఏమి చేస్తున్నావు?" "ప్రార్థన చేస్తున్నాను" అని ఆ బిడ్డ చెప్పెను. "ఏమి ప్రార్థన

చేస్తున్నావు?" "అమ్మా, నాకు ..ణితంతము రాదు దేవునికి వచ్చును. బి.ఎ.టి. అంటే బ్యాట్; సి.ఎ.టి. అంటే క్యాట్; ఎఫ్.ఎ.టి. అంటే ఫ్యాట్ అని నేర్పించావు కదా? చిన్న చిన్న పదాల గుణింతము కూడా నాకు రాదు. అందుకని అక్షరాలన్ని దేవునికి చెప్పుతున్నా. దేవుడు వాటినే మాటలుగా మార్చుకొంటాడు." ఆ బిడ్డ మనస్సు సరిగా నుండెను. విశ్వాసముతో ప్రార్థన చేయుచుండెను. ప్రార్థన చేయునప్పుడు సరియైన పదములను నీవు ఉపయోగించినను, లేకున్నను తంటాలేదు. వచ్చిన ప్రశ్న ఏమనగా, విశ్వాసముతో ప్రార్థన చేయుచున్నావా? "అవును ప్రభువా నన్ను జ్ఞాపకమునకు తెచ్చుకొనుచున్నావు అని నేను నమ్ముచున్నాను. "ఇట్లు నిజముగా చెప్పగలవా? ఇవి సులభమైన మాటలేగాని హృదయాంత రంగమునుండి రానిమ్ము. నిన్ను నీవు చూచుకొనకూడదు. నీ స్థితిని చూడకూడదు. నీ పాపములు, తప్పిదములను సహితము చూడకూడదు. వీటికి పెడముఖము పెట్టి, ఆయనవైపు అనగా నిన్ను ప్రేమించు రక్షకుడు, నీ సజీవుడైన రక్షకుడు మరియు నీ తల్లి, తండ్రి, భార్య, సహోదరుడు, సహోదరి బిడ్డ, స్నేహితులు, నిన్ను ప్రేమించువారి కంటె ఎక్కువగా నిన్ను ప్రేమించునట్టి రక్షకుని వైపే నీవు చూచుచుండవలెను.

కీర్తనలు 27:10లో కీర్తనల గ్రంథకర్త ఇట్లనుచున్నారు : "నా తల్లిదండ్రులు నన్ను విడిచినను యెహోవా నన్ను చేరదీయును". నీ తల్లి, తండ్రి, నీ సహోదర సహోదరీలు, నీ ప్రియులు నీ జీవితములో ఒకదినము నీకు విరోధముగా తిరుగుట సాధ్యమే. దారితప్పి నడుచుచున్న తమ బిడ్డలకు విరోధముగా ఎందరో తల్లులు, తండ్రులు ఎదురు తిరిగియున్నారు. అయినను దేవుడేమి చెప్పుచున్నాడు? "నీ తల్లిదండ్రులు నిన్ను విడిచినను నేను నిన్ను చేరదీయుదును. నీవైపు చూచుకొనవద్దు. నీవు ఎవరవైనను, నీ పాపములు ఎంత అవమానకరములైనను క్రొత్తగా జన్మించిన వెనుక నీవు

ఎంతగా ప్రభువు యెడల తప్పియుండినను దేవుని ఎదుట ఈ మాటలు చెప్పగలవా? "యెహోవా నన్ను కూడ జ్ఞాపకమునకు తెచ్చుకొనుము". ఈ సులభమైన ప్రార్థన నిన్ను దేవుని సమీపమునకు, దేవుని నీ సమీపమునకు తెచ్చుట నీవే చూతువు. "నన్ను జ్ఞాపకమునకు తెచ్చుకొనుము" అనుచు, కీర్తనల గ్రంథకర్త ఇంకేమి చేర్చి చెప్పుచున్నాడో కీర్తన 106:5లో చూడుము : "నీ ప్రజలయందు నీకున్న దయ చొప్పున నన్ను జ్ఞాపకమునకు తెచ్చుకొనుము."

లోకములో చూచినచో జనులు వివిధ వర్గములుగా నున్నారు. "మేము భారతీయులము" "మేము చీనావారము" "మేము జపాను వారము" అనుచు మాతృదేశములను బట్టి వేరువేరు గుంపులుగానున్నారు. ధనికులు, ధనహీనులు, మధ్యరకపువారు ఈ విధముగా ఆర్థిక బేధములను బట్టి కూడ మనుష్యులు వేరువేరు వర్గములుగా నున్నారు. భాషను బట్టి విద్యను బట్టి వృత్తిని బట్టి గూడ మనుష్యులు వేరువేరు గుంపులకు చేరియున్నారు. బైబిలులో చూడగా సమస్తమైన వారు కూడ చెందియుండునది రెండే సమూహములకు. దేవుని ప్రజలు, సాతాను ప్రజలు. "మేము దేవుని సంబంధులము. మా తండ్రి అబ్రాహాము" అని ఆ యూదులు చెప్పగా, యేసు ప్రభువు వారికిట్లు జవాబు చెప్పెను. "మీరు దేవుని సంబంధులు కారు. మీరు మీ తండ్రియగు సాతాను సంబంధులు" (యోహాను 8:40, 41, 44) ఇవి చాలా **కఠినమైన మాట**లు. అవి తప్పక కోపము పుట్టించునవి. అయితే, మనము జ్ఞాపకము చేసికొనవలసినది ఏమనగా, ఆ మాటలు మనుష్యుని మాటలు కావు, ప్రభువైన యేసుక్రీస్తు చెప్పిన మాటలివి.

నీవు ఏ సమూహమునకు చెందియున్నావు? నీ జాతి, వృత్తి, ధనము, బైబిలు జ్ఞానము, పేరు, ప్రతిష్ఠలు ఇవి నాకు అవసరము లేదు. దేవుని ప్రజల సమూహములో నున్నావా? లేక ఆ మరొక సమూహములోనా? దేవుని

యొక్క దైవజీవమును నీవు అంగీకరించినప్పుడే దేవుని కుటుంబములో నుండు వారిలో నొకడవగుదువు. ఒక మంచి సూటుకేసు కొని లేక మంచి షర్టుగాని, నెక్ టైగాని తొడుగు కొనేసరికి నీవు ఒక ఇంగ్లీషువాడవుగ గాని, అమెరికా వాడవుగగాని అయిపోదువా?

పూర్వము రైల్వే ఉద్యోగములకు అంగ్లో-ఇండియనులనే ముఖ్యముగా ఎన్నుకొనెడివారు. భారతీయులు ఈ ఉద్యోగముల కొరకు అర్జీలు పెట్టుకొనునప్పుడు అనేకులు జోళ్ళను, ఇంగ్లీషు టోపీలను, నెక్ టైలను అక్కడ, అక్కడ అరువు తీసుకొని, పేరు మార్చుకొని, ఆఫీసరును సంధించునప్పుడు, నేను స్మిత్‌గారు, నేను హెన్రీగారు, నేను మాథ్యూగారు అని ఈ విధముగా క్రొత్త పేర్లు చెప్పుచుండిరి. ఇప్పుడు కాలము మారిపోయినది స్మిత్‌గారు గురుస్వామిగారు అయిపోయిరి. పేరు మార్చుకొను నంతలో ఒకడు ఇంకొకడగునా?

దేవుని ప్రజలలో నొకడివా? నీ ఎడల నీవే యదార్థవంతుడవు కమ్ము. ఇది నీ తొలి ప్రార్థనగా నుండనిమ్ము : "నీ ప్రజల యందు నీకున్న దయ చొప్పున నన్ను జ్ఞాపకమునకు తెచ్చుకొనుము." దేవుని ప్రజలలో నొకరిగా నుండుట ఎంత భాగ్యము! ఎంత ఘనత! సాతాను యొక్క కుమారులు దేవుని యొక్క కుమారులుగా మారిపోవు నిమిత్తమే క్రీస్తుయేసు నాథుడు ఈ భువికి వచ్చెను.

ఇండియాలో ఎక్కడకు వెళ్ళినా లెక్కలేని భిక్షగాండ్రున్నారు. ముష్టివాడు నిన్ను "నాయనా" అని పిలుచును. "ఏమి కుమారుడా?" అందువా? ఎన్నిమారులు ఆదారిలో నీవు నడిచినను, వాడు నిన్ను 'నాయనా' అనియే పిలుచును అట్లు పిలుచునంత మాత్రమున, వాడు నీ కుమారుడై పోవునా? ఒక పురుషుని ద్వారా ఎవడైతే జీవము పొందెనో వాడు మాత్రమే ఆ పురుషుని

కుమారుడు. మనలను తన ప్రజలని దేవుడు పిలువగలుగునా? నన్ను దేవుడు, 'నా కుమారుడా' అని పిలువగలడు. ఆయనకు ఎంతగానో వందనములు చెల్లిస్తున్నాను. అయితే దేవుని వలన ఆయన జీవమును, అనగా నిత్యమైన ఆత్మీయ జీవమును, క్రొత్తదియగు దైవజీవమును పొందునప్పుడే నీవు దేవునికి ఒక బిడ్డవు కాగలవు. ఇది జరిగినప్పుడు నీవు అడుగకుండనే దైవకృపను పొందుదువు.

అటు తరువాత, "నాకు దర్శనమిచ్చి నన్ను రక్షింపుము" అని కీర్తనల గ్రంధకర్త అనుచున్నాడు. అనగా నీ రక్షణను సంపూర్ణముగా చూపుము అనునది అతని భావము. నీవు ఒక వైద్యుడవు కావలెనని ఇట్లు చేసితివనుకొనుము : వైద్య కళాశాలకు పోయి, ఆ కట్టడమంతయు తిరిగి మనుష్యుల అస్థి పంజరములవైపు చూచితివి. కోసి పరీక్షించుటకై యుంచబడిన మృత కళేబరములను చూచితివి, అటు వెనుక ఎన్నో వైద్యశాలలను దర్శించి, పెన్సిలిన్, స్ట్రెప్టోమైసిన్ మొదలైన అనేక ఔషధముల పేర్లను కంఠస్థము చేసితివి. ఈ విధముగా ఒక వారము రోజులు తిరిగి, తిరిగి ఇంటికి మరలివచ్చి మీ తల్లితో ఇట్లనగలవా? 'అమ్మా నేను డాక్టర్ అయిపోయాను." "ఇంతలోనే అయిపోయావా!" అని ఆమె అడుగును. 'నాకేమి, అమ్మా? ఎముకలన్ని చూచాను. శవాన్ని కూడా చూచాను. పెన్సిలిన్, స్ట్రెప్టోమైసిన్ అంటే ఏమిటో తెలిసిపోయింది. చూడు ఒక స్టెతస్కోపు (Stethoscope) కూడా కొనుక్కొన్నాను. ఇప్పుడు డాక్టర్ని కానా?" ఈ విధముగా ఎవరును డాక్టర్లు కారు. వ్యాధులను గూర్చియు ఔషధములను గూర్చియు శరీరములో ఆ ఔషధములు చేయు పనులను గూర్చియు అనేక సంవత్సరములు పఠించితేనేగాని, నీవు ఏమియు నేర్చుకొనజాలవు.

క్రైస్తవులనబడువారు అనేకులున్నారు. ఒక నాలుగు బైబిలు వచనాలు నేర్చుకొనగానే రక్షణ పొందగలరని వీరి భావము; అయితే రక్షణ చాల

గొప్పది, నిత్యమైనది. కొద్దిపాటి రోజులలోగాని, సంవత్సరములలో గాని, అది ఎట్టిదో గ్రహింపజాలము. క్రీస్తును మనము సంపూర్ణముగా తెలిసికొనుటకు నిత్యత్వమంతయు కావలసి యుండును. కీర్తనల కర్త ఏమనుచున్నాడు? "నాకు దర్శనమిచ్చి నన్ను రక్షింపుము." "ప్రభువా, బైబిలు విషయము నాకింకను అధికముగా నేర్పుము" అనుట లేదు. అకలిగాని, "నీ రక్షణను గూర్చి నాకు మరింత సంపూర్ణముగా నేర్పుము" అనుచున్నాడు.

షాజహాన్ అను పేరుగల ఒక మొగలు చక్రవర్తి యుండెను. అతని కుమారుడే అతనిని చెరలో వేసెను. ఆ కుమారుడు ఇట్లనుకొనెను : "మా నాయన త్వరగా చావడు. నేనెప్పుడు సింహాసనము ఎక్కడము?" అందుకని తండ్రిని ఆగ్రా కోటలో చెరబెట్టి, బఠాణీలు మాత్రమే అయనకు ఆహారముగా నిచ్చెను. అదృష్టవశాత్తు ఆ తండ్రికి ఒక వంటవాడు ఉండెను. అతడు వట్టి బఠాణీలతోనే, డెబ్బదియైదు రకముల వంటలు చేయగలవాడు. ఏందుకీ కథ చెప్పబడినదనగా సాధారణమైన వస్తువులను ఉపయోగించు నేర్పరితనము పొందవలెనంటేనే, ఎన్నో సంవత్సరములు పట్టును. ఇంత గొప్ప రక్షణను గూర్చి అంత స్వల్పకాలములోనే తెలిసికొనగలవా? అది ఎంత గొప్పదో నీవు ఊహించలేవు.

దేవుడు చేయు ప్రతి కార్యము ఏ సంకల్పముతో, ఏ యుద్దేశముతో అయన చేయుచున్నాడో సంపూర్ణముగా గ్రహించగలుగుటకు నేర్చుకొనవలెను. నిన్ను ఏల వెదకుచున్నాడు? నిన్ను వెదకుటకును, నిన్ను పిలుచుటకును, అంత సమయము, అంత శ్రమ అయన ఏల తీసుకొనవలెను? ఈ నిదర్శనము చూడుము. పర్వతముల మీద మరెచి ఔషధములకు అవసరమైన కొన్ని విధమైన మొక్కలు మొలుచును. ఏవేవో వ్యాధులకును, గాయములకును ఉపయోగించుటకై వీటిని వెదకి పోగుచేసికొందురు. ఈ మొక్కల, ఈ ఆకుల విలువను తెలిసినవారు వాటిని వెదకుచు అనేక మైళ్ళు

ఎన్నో మాసములు, సంవత్సరములు తిరుగుదురు. వాటి విలువను ఎరుగనివారు ఆ మొక్కల ప్రక్కనుండి నడుచుచు వెళ్ళినను వాటిని కన్నెత్తి చూడరు. ఒక్క క్షణము దగ్గర ఆగరు. ఆత్మీయముగా కూడ ఇంతే. నీ విలువ ఎంతో నీ తల్లిదండ్రులకు అంతగా తెలియకుండును. గాని దేవునికి అంతయు తెలియును. ఒక ఆత్మయొక్క విలువ దేవుని దృష్టియందు ఈ లోక సమస్త ఐశ్వర్యమును మించినదై యున్నది. నిన్ను ఎటువంటి వస్తువుగా ఆయన హస్తము చేయగలదో అది ఎరిగి దేవుడు నిన్ను వెదకుచున్నాడు. నిత్యత్వమునకు ఆయన యొక్క పాలి భాగస్తునిగాను, జత పనివానిగాను నిన్ను చేయగోరుచున్నాడు. దేవుని రక్షణనుకోరుచు కీర్తనల గ్రంధకర్త ఒకప్రార్థన చేయుచున్నాడు : "ఓ దేవా! నీవు ఏర్పరచుకొనిన వానిగా నన్ను చేయుము.' ' 4వ వచనములో కారణము చెప్పుచున్నాడు. "నీవు ఏర్పరచుకొనినవారి క్షేమమును నేను చూచుటకు."

నేనొకప్పుడు ఒక ఇంటికి వెళ్ళియుంటిని. అక్కడ గోడబల్ల మీద ఎంతో అందమైన రంగు చిత్రములు వేయబడిన వస్తువులు ఎన్నియో యుండెను. "ఇవి ఏమి?" అని ఇంటి యజమానుని అడిగితిని. అవి గ్రుడ్ల గుల్లలేనట. ఒక గ్రుడ్డును తీసి, చిన్న రంధ్రముచేసి లోపలిదంతయు ఖాళీచేసి ఆ గుల్లమీద ఒక మంచి పటమును వేయుచుండెను. అతడు నేర్పరియైన చిత్రకారుడు. సంవత్సరముల కొలది ఈ వట్టి గుల్లలను సేకరించుచు ఒక్కొక్కదాని మీద ఒక్కొక్క అందమైన పటమును వేయుచుండెనట. మనము ఊరకనే పారవేయు గ్రుడ్డు గుల్లలు ఒక చిత్రకారుని చేతిలో పడినప్పుడు అందమైన, ప్రయోజనకరమైన అలంకారమాయెను. నీకొక గ్రుడ్డు దొరికినప్పుడు దానిని ఒలిచి లోపలి పదార్థమును తిని, వట్టి గుల్లను పారవేయుదువు. చిత్రకారుడు ఆ పనికిమాలిన గుల్లలతో ఎంత సొగసైన వస్తువులను తయారుచేసెనో చూడుము!

నీవు పాపము వలన చెడిపోయి ఒక వికార రూపమును కలిగి యుండవచ్చును. నీ ముఖము మీదనున్న పాపపు గుర్తులు అందరికిని కనబడుచున్నవి. అయినను నిన్ను ఏర్పరచుకొని నీకు పిలుపు నిచ్చుటలో దేవునికి ఒక సంకల్పము కలదు. దేవుని వాక్యమందు మనము మురికి గుడ్డలకును, ఎండు గడ్డికిని, వాడిపోయిన పువ్వులకును, ఎండిపోయిన ఆకులకును పోల్చబడియున్నాము. అనగా, దేవుని దృష్టియందు మనమింతే అయినప్పటికిని మనలను ఏర్పరచుకొని యున్నాడు. తన ఘనత, తన మహిమ వెల్లడి చేయునట్టి పరలోక సంబంధమైన పాత్రలుగా నిన్ను నన్ను చేయవలెనని యున్నాడు. ఆ కార్యము దేవుడు మాత్రమే చేయగలిగినట్టిది. మానవుని తరము కాదు. దేవుడు ఏర్పరచుకొనిన పాత్రలలో ఒక పాత్రగా నీవు ఉండగోరుదువా? నీకు ఏ యోగ్యత లేకున్నను నిన్ను ఏర్పరచుకొనుట ఆయనకు ఇష్టము. నీవే అయన యొద్దకు వచ్చి సంపూర్ణముగా అయనకే లోబడినచో, నిత్యత్వమునకు తనకు పనికి వచ్చు ఒక పాత్రగా నిన్ను చేయును.

"ఆయన దాసుడైన అబ్రాహాము వంశస్థులారా,- ఆయన యేర్పరచుకొనిన యాకోబు సంతతి వారలారా" (కీర్తన 105:5).

ఇక్కడ ఆయన ఏర్పరచుకొనిన వాడని యాకోబు పిలువబడు చున్నాడు. యాకోబు ఎట్టివాడో అంతయు ఎరిగి యుండియే దేవుడు అతనిని ఏర్పరచుకొనెను. మనము ఉర్లగడ్డలు లేక టమాటాలు కొనుటకు సంతకు వెళ్ళితిమి అనుకొందము. అక్కడ ఒక మంచి అంగడిని వెదకి వెళ్ళుదుము? ఉర్లగడ్డలు, టమాటాలు, ఉల్లిగడ్డలు కిలో ఎంతో చెప్పి తూకము తూచి ఇమ్మందుము. మన స్వంతమునకే కొనుచున్నందున మంచి మంచివి ఏరుకొనుచున్నాము. "ఇది మంచిది, అదేమి మంచిదికాదు. ఇది చాలా పెద్దది, అది చాలా చిన్నది. ఇది పాత సరుకు ఇదంతా

నలిగిపోయింది.'' ఈ విధముగా ఎంతో జాగ్రత్తతో ఆ కూరగాయలను ఎన్నుకొనుచున్నాము. ఇది మన పద్ధతి మనలను ఏర్పరచుకొనుటలో దేవుని పద్ధతి ఇదికాదు. ఆయన ఇట్లు చెప్పును : "నీవు వికారముగా నున్నావా? పాపము వలన చెడి మలినమై యున్నావా? ఫరవాలేదు'' నీ వెందుకును పనికిరావని మనుష్యులు చెప్పవచ్చును. దేవుని యొద్దకు వెళ్ళినచో, అయన అడుగునది ఇంతే : "నా పాత్రగా ఉండుటకు నీకిష్టమా? నిన్ను నీవు సంపూర్ణముగా నాకు సమర్పించుకొనుటకు ఇష్టమేనా? ఆయన చేతులకు అప్పగించుకొనినట్లయిన ఏ విధముగా నిన్ను కడిగి శుద్ధిచేసి, మార్చవేయవలెనో అంతయు ఆయన ఎరుగును.

నీవు దేవునికి ఆలోచనలు ఇచ్చువాడవుకావు. చాకలికి బట్టలు వేయునప్పుడు : "చాకలిగారూ బట్టలు ఈలాగు ఉదకవలెను ముందుగా నీళ్ళల్లో తడిపి, తరువాత వాటికి సబ్బుపెట్టి, పులిమి, తిరిగి నానబెట్ట వలెను'' అని అందువా? చాకలివాడు : "ఏమయ్యా నీవు నా వృత్తి నాకు నేర్పుదువా? నీ బోధ ఇంక చాలించు. బట్టలుదికే పద్ధతి తెలియకనే చాకలి పని చేస్తున్నానా?'' అని అనును. మురికి బట్టలను ఉదికి శుభ్రము చేయుట చాకలివానికి తెలియును : మలినమైన పాపిని శుద్ధీకరించి, తేజోవంతునిగా మార్చివేయుట క్రీస్తుకు తెలియును. నీవు చేయవలసిన పని ఇంత మాత్రమే. అయనచే ఏర్పరచుకొనబడిన ఒక పాత్రగా నగుటకు ఇష్టపడి సిద్ధపడవలెను.

దేవుడు యాకోబును ఏర్పరచుకొని, అతనిని ఒక రాజ కుమారునిగా మార్చివేసెను. ఈ పని నెరవేరుటకు ఇరువది సంవత్సరములు పట్టెను. లాండ్రీకి మాసిపోయిన బట్టలు నీవు తీసుకొని వెళ్ళగా ఉదికిన బట్టలు తెచ్చుకొనుటకు ఇరువది సంవత్సరములు అయిన వెనుక రమ్మని లాండ్రీవాడు చెప్పిన యెడల ఏమందువు? మనమైతేనో మాసిపోయిన బట్టలకంటె మలినమైన వారము. ప్రభువు మనము తన సారూప్యము లోనికి వచ్చు

పర్యంతము మనలను శుభ్రము చేయుచునేయుండును. తన కుమారుని సారూప్యము మనము పొందు వరకు దేవుడు తృప్తిపడడు.

ఆయన ఏర్పరచుకొనిన పాత్రగా నీవుండగోరెదవా? ఆయన తృప్తి చెందువరకు, కడుగబడుటకును, శుద్ధీకరించబడుటకును ఇష్టపడుచున్నావా?

## 3వ అధ్యాయము

# ఏర్పరచుకొనబడిన పాత్ర

అపొస్తలుల కార్యములు 6:5 గమనించుము. "వారు స్తెఫనును...ఏర్పరచుకొనిరి." పరిశుద్ధాత్మ వలన నడుపబడగా, అందరు స్తెఫనును ఏర్పరచుకొనిరి. ఓట్లువేసి ఎన్నుకొనలేదు. ఏక మనస్కులై ఏర్పరచుకొనిరి. గ్రీకుబాషలో వ్రాయబడిన నూతన నిబంధనలో "ఏర్పరచుకొనబడిన" అను పదము ఈ అర్థముతో కూడియున్నది: "ఎదురు పలుకు లేక, ఏక మనస్సుతో," కలహములకు, ఆక్షేపణలకు, జగడములకు అక్కడ చోటులేదు. స్తెఫను" అనగా "కిరీటము" అని అర్థము. బహు కొద్దికాలమే అతడు జీవించియుండెను. కాని అతనిది ఎట్టి జయకరమైన జీవితము! మనము ప్రభువునందు అనేక సంవత్సరము లుండినను, మనము నెరవేర్చిన దానికంటె ఎంతో అధికముగా ఈయన ఒక్కడే తన స్వల్ప జీవితమాలమందు నెరవేర్చెను. ఒక కిరీటమును, తేజోవంతమైన కిరీటమును పొందుటకు యోగ్యుడై యుండెను.

స్తెఫనును గూర్చి ఎక్కువగా వ్రాయబడలేదు. అతని తల్లిదండ్రు

లెవరో మనకేమియు తెలియదు. మెరయుచున్న తేజోవంతమైన ఒక తారవలె అకస్మాత్తుగా ప్రత్యక్షమగుచున్నాడు. హత సాక్షులలో మొట్టమొదటివాడై మరణ సమయమందు మన ప్రభువైన యేసుక్రీస్తు నామము నెత్తిపిలుచుచు, ప్రాణము విడిచియున్నాడు. దేవుడు స్తెఫనును ఏల ఏర్పరచుకొనెనో అతని యొక్క జీవితము పరిచర్యల ద్వారా ప్రత్యక్షమగుచున్నది. స్తెఫను వలెనే ఏర్పరచుకొనబడుటకు అనగా పరమ పిలుపుతో దేవుని వలన పిలువబడుటకు కోరుదువా? కీర్తనలు 10:1లో "ఆయనకు .... స్తుతులు చెల్లించుడి," యని వ్రాయునప్పుడు కీర్తనల గ్రంథకర్త హృదయమందుండిన కోరిక, నీ మనస్సునందు గలదా? స్తుతి పరలోక సంబంధమైనది. మనము దేవుని స్తుతించుట వట్టి భూసంబంధమైన ఆశీర్వాదములకు మాత్రమే కాదు; నిత్యత్వము యొక్క ఆశీర్వాదములకును, పరలోకపు నిరంతరపు, మహిమావవంతమైన వాటి కొరకు కూడను ఆయనను స్తుతించుము. జయకరమైన జీవితము జీవించవలెనంటె దేవుని ప్రజలతో ఒకరమై యుండుట యనగా నేమి యనునది మున్ముందు గ్రహించవలెను. "యెహోవా నీ ప్రజలయందు నీకున్న దయ చొప్పున నన్ను జ్ఞాపకమునకు తెచ్చు కొనుము" (కీర్తనలు 106:5).

పరసంబంధమైన జనము, ప్రతిష్ఠిత జనము, ఏర్పరచుకొనబడిన జనము, దేవుని బలమైన హస్తముతో పైకిలాగబడిన జనము, ఆయనకొక "స్వకీయ ధనము"గా ఏర్పడిన జనములో నీవు ఒకడవై యున్నావను ఆత్మీయ నమ్మకము నీకున్నదా? మనుష్యుడు ఎవరినైనను దేనిని బట్టి ఏర్పరచుకొనుననగా అంతస్థు, స్థితి, ధనము, కీర్తి ఇట్టివానిని బట్టి ఉండును. కాని, దేవుని కొలత వేరు. పాపము వలన చెడిపోయి ఎందుకును పనికిరాని, అక్కరకు రాని మురికి గుడ్డలవలె మన ముండినను, "నా కుమారుడా, నా కుమారీ, నాకొక "స్వకీయ ధనముగా నుండుము" అని ఆయన చెప్పుచున్నాడు.

మనము ఆయన చేతికి అప్పగించు కొనినచో నిత్యత్వమునకు ఏ విధమైన పాత్రలుగా మనలను తయారు చేయగలుగునో ఆయన ఎరిగియున్నాడు. కావున ఆయన నిన్ను ఏర్పరచుకొనగోరిన ఎడల ఆయన చేతిని త్రోసివేయకుము. కీర్తనలు 106:4,5లో కీర్తనల గ్రంధకర్త, "నీవు ఏర్పరచుకొనిన వారి క్షేమము నేను చూచుచు, నీ జనులకు కలుగు సంతోషమును బట్టి నేను సంతోషించుచు, నీ స్వాస్థ్యమైన వారితో కూడి కొనియాడునట్లు" అని ప్రార్థన చేయుచున్నాడు. ఇవన్నియు స్తెఫను జీవితమందు నెరవేరెను. దేవునిచే ఏర్పరచుకొనబడిన పాత్ర గనుక స్తెఫను అనేకులకు పరమ సంతోషమును కలిగించెను. ఆ మహాస్వాస్థ్యమును గూర్చి విశ్వాసియై యున్నందున పరిశుద్ధులతో కలసి హర్షించెను.

నా క్రైస్తవ జీవిత ప్రారంభ కాలమందు జరిగిన ఒక విషయము జ్ఞాపకమున్నది. అది 1936వ సంవత్సరము. క్రొత్తగా క్రైస్తవుడనై యుంటిని. రైల్వేస్టేషనులో మా తండ్రి నన్ను కలిసికొని ఇట్లనిరి : "నీవు క్రైస్తవుడవైనందుకు మాకు ఏ మాత్రమును అభ్యంతము లేదు. అయితే మన గ్రామానికి నీవు వచ్చినప్పుడు నీవు క్రైస్తవుడవని చెప్పకోవద్దు ఇది నా మనవి. బైబిలు చదువుకో, ప్రార్థన చేసుకో, ఇంకేమి కావలెనో చేసుకో అయితే క్రైస్తవుడనని మాత్రము చెప్పవద్దు. మన గ్రామములో తప్పించి, నీవెక్కడ ఉండినా, నీ ఇష్టప్రకారము చేయవచ్చును." అప్పుడు నేనిట్లంటిని : "నాయనా, యేసునాధుడే నా జీవము. ఆయనను బొంకితే నా జీవము పోవును. నేను ఊపిరి తీసుకొకుండ బ్రతికి ఉండగలవా? ఆయన నా ప్రాణమై ఉండగా, ఆయనను బొంకితినంటె ఒక గడియలో నా ప్రాణము పోవును." అప్పుడు మా తండ్రి మరొక సలహానిచ్చిరి; "సరే, నీకిదే బాగుంటే ఇంకొక మాట వినుము. ఒక మూడు నెలలకు ఏదో ఒక పనిలో ప్రవేశించు. అప్పుడు నీవు క్రైస్తవుడవైనప్పుడు పనికి రాజీనామా ఇచ్చితివని అందరు చెప్పకొంటారు.

లేకుంటే ఏ ఉద్యోగము లేదు; అందుకే క్రైస్తవవుడవైతివని అంటారు". అప్పుడు నేనిట్లు చెప్పితిని; "ఒక్కవారానికైనా వద్దు; ఒక్క దినానికైనా వద్దు. నేనొక ఉద్యోగములో ప్రవేశిస్తే దేవుని ఘనపరచలేను. ఇక నేను దారి తప్పిపోవడము కూడా సంభవించగలదు." దేవుని దృష్టియందు సమస్తలోక ఐశ్వర్యముకంటె ఒక్క ఆత్మ ఎంతో విలువ గలిగియున్నది. స్తెఫను యొక్క జీవితమందు నెరవేరిన పర సంబంధమైన విషయముల ఆత్మీయ అర్థమును ఈ విధముగా దేవుడు నేర్పుచున్నాడు. అతడెవడో, ఏ కుటుంబమో ఏ గ్రామస్థుడో ఏ దేశస్థుడో, అతని విద్య ఏ పాటిదో మనకేమియు తెలియదు; అయితే దేవుని దృష్టియందు అతడు అతి ప్రశస్తమైనవాడు.

లోకమందు ఎన్నిక పొందవలెనని గొరువారు పేరు ప్రతిష్టలు సంపాదించు నిమిత్తము ఎన్నో పాట్లు పడుదురు. ఒక ఎం.ఎల్.ఎ. కావలెనంటె, ఇక్కడ పరుగెత్తి అక్కడ పరుగెత్తి ఎంతో డబ్బుపోసి ఆ పదవి సంపాదించుదురు. శాసనసభలో ప్రవేశించిన వెనుక ఒక కుర్చీని అలంకరించడమే, ఎప్పుడో ఒకమారు చేతులు పైకెత్తుదురు. లేకుంటే ఊరికే కూర్చుండడమే. దేశ క్షేమమును గూర్చి ఎట్టి చింతయు వారికి లేదు. వారున్న పదవికి ఏ యోగ్యతయు వారికి లేదు. పేరు వెనుక ఏవో కొన్ని అక్షరములు తగిలించుకొనుటయే వారికి కావలసియుండెను. ఏదో పేరు పొందుటకై మనుష్యులు ఇన్ని పాట్లు పడుట ఎంత విచిత్రమో.

నీవు నేను పరసంబంధమైన కీర్తి, నిత్యత్వమునకు నిలిచియుండు పేరు పొందుటకై ఎట్లు ఏర్పరచుకొనగలమో అపొస్తలుల కార్యముల నుండి తీసి పై జూపబడిన వాక్యము తెలుపుచున్నది. ఉదాహరణముగా నీవు ఏదో గ్రామములు దర్శించితివి అనుకొనుము. అక్కడ కొందరు విశ్వాసులున్నారు "సుబ్బారావుగారు తెలుసా?" అని ఎవరినో అడిగితివి. "తెలియదు" అని జవాబు చెప్పిరి. అది చాలా చిన్న గ్రామమైనను సుబ్బారావు పేరు వినినవారు

ఎక్కడో ఒక్కరిద్దరే. ఈ సుబ్బారావుని దేవుడు ఏర్పరచుకొని యుండిన యెడల పరలోకములో "తెలియదు" అని చెప్పరు. అక్కడ ఏ దేవదూతనైనను "సుబ్బారావు తెలుసా?" అని నీవు అడిగినచో, "తెలియకేమి చాలా బాగా తెలియును" అని ఆ దూత ప్రత్యుత్తరమిచ్చును. "మీకు ఏలాగు తెలియును?" అని నీవు అడిగినచో, "మా పరలోక రాజు అతనిని ఏర్పరచుకొని, తానే ఈ సంగతి మాకు తెలిపెను" అనును. ఈ లోకమందు ఒకమనుష్యుడు ఎంత సామాన్యుడైనను అతనిని దేవుడు ఏర్పరచుకొనిన ఎడల పరలోక సైన్యము హర్షించుచు, ఆనందముతో అతనిని అంగీకరింతురు. ఆయన ఏర్పరచుకొనిన పాత్రలుగా నుండుటకు ఇష్టపడు విశ్వాసులు కొద్దిమంది మాత్రమే. ఎంత విచారము! వారమునకొకసారి ఆరాధనకు వెళ్ళి, నెలకొకసారి కొంత డబ్బు ఇచ్చువారు అనేకులున్నారు. తాము చాలా మంచి క్రైస్తవులని ఎంచుకొనుచున్నారు. వారు చెప్పునది ఏమనగా, "మేము ఎవరికిని హాని చేయడము లేదు; అబద్ధములు చెప్పడములేదు. ఎవరిని మోసగించడము లేదు; మేము నెమ్మదిగా జీవిస్తున్నాము. ప్రతి ఆదివారము గుడికి వెళ్ళి నలభై అయిదు నిమిషములు కూర్చుంటాము. ఈ ప్రార్థన కూటాలకైతే మేము రాలేము. మాకు పనులు ఎక్కువ. అంతేకాక అక్కడికి వచ్చినా మాకు నిద్ర వచ్చును." నీవు ఒక మంచి క్రైస్తవుడవు అయి యుందువు ఉన్నతమైన నీతియే నీ గురి, అయితే దేవునికి ఇవి చాలవు. ఆయన నిన్ను ప్రేమించు చున్నాడు. తన రక్త క్రయము చెల్లించి నిన్ను కొనియున్నాడు. ఎందుకనగా నిన్ను తాను ఏర్పరచుకొనిన పాత్రగాను, తన స్వకీయ ధనముగాను తన ద్రాక్షావనముగాను తన జత పనివానిగాను నిత్యత్వమునకు తన పాలి భాగస్థునిగాను చేయు నిమిత్తమే.

ప్రథమముగా, ఆవశ్యకమైన విషయము స్తెఫనువలె నుండుట. అదేమనగా ఏదో ఒక పదవి పొందవలెనని పనిచేయుట కాదు. కొందరు

ఎట్టివారనగా కొంత జీతము ఇచ్చినచో రేయింబగళ్ళు పని చేయుదురు. ఇవ్వనిచో ఏమియు చేయక ఊరకుందురు. తమకొక పేరు తెచ్చుకొనుటకే వారు ఏ పనిన్నైనను చేయుట స్తెఫనును గూర్చి ఏమి తెలిసికొంటిమి? జీతము కావలెననిగాని, ఘనత సంపాదించవలెనని గాని కోరక నెమ్మదిగా, ప్రేమతో పనిజేసెను (అపొస్తలుల కార్యములు 6:1,2).

శిష్యుల సంఖ్య విస్తరించుచు, ప్రభువు శక్తితో పనిచేయుచుండిన దినములలో అనుదిన పరిచర్యలో తమలోని విధవరాండ్రను సరియైన రీతిగా చూడలేదని, హెబ్రీయుల మీద హెల్లేనీయులు సణుగునట్లు గొణుగునట్లు సాతాను ప్రేరేపించి దేవుని జనుల మధ్య కలహములు జగడములు బహుయుక్తితో తెచ్చిపెట్టెను. అన్ని శతాబ్దములలోను దేవుని పనిని ఆటంక పరచుటకును, ఆయన సేవకులు సత్య పరిచర్య చేయ కుండునట్లును సాతాను రెండు ఆయుధములను ఉపయోగించుచున్నాడు. మొదట దానిని ఇట్లు ఉపయోగించుచున్నాడు, ఎప్పుడైతే దేవుడు ఒక పనిని ప్రారంభించి జీవితములందు తన శక్తిని కనబరచుచుండునో అప్పుడే దేవుని జనుల మధ్య సణుగులు గొణుగులు, ఫిర్యాదులు, జగడము బయలుదేరి ఆ పనిని ఆటంకపరచి, చెడగొట్టుచున్నవి. దేవుని ఆత్మను ఆర్పివేయుటకు, సణిగెడు విశ్వాసులు కొందరే చాలును. ఆయన పని చెడుచున్నది. సాతాను ఉపయోగించు మరొక ఆయుధము దైవసేవకులు ఆయన వాక్య పరిచర్య చేయక బల్ల దగ్గర వడ్డనలు చేయునట్లు బలవంత పరచుసది. ఏ పరిచర్య కొరకు అపొస్తలులు ఏర్పరచుకొనబడిరో ఆ ప్రధానమైన దానినే వారు మానివేయుట సాతానుకు కావలసియున్నది. లోకములో ఎక్కడ చూచినను ఇటువంటివి దైవ సేవకుల మధ్య కానవచ్చుచున్నవి. దేవుడు వారిని ప్రసంగికులుగాను, ఉపదేశకులు గాను,బోధకులుగాను ఏర్పరచుకొనగా, వారేమో బల్లల దగ్గర వడ్డనలు చేయుచున్నారు. కొంతకాలము నమ్మకముగానే

యుండిరి. అయితే పని విస్తరించిన కొలది లోక వ్యవహారములలో చిక్కుకొనిరి. దేవుని సేవకులలో కొందరి భార్యలు లౌకికులైనందున ఇంటియందు సమాధానము కోరుచు ఈ అమ్మగార్ల కొరకు భర్తలు ఉద్యోగములు చేయవలసి యున్నది. వివాహమునకు పూర్వము ఈ పురుషులు వారి జీవితమందలి మొదటి స్థానము దేవుని వాక్యమునకిచ్చి, ఎంతో సమయము ప్రార్థనలో గడిపి, బహు ఆసక్తి గలిగియుండిరి. ఇప్పుడు అదంతయు చల్లారిపోయెను. క్రమ క్రమముగా క్రిందికి జారిపోవుచున్నారు. ముందు ఒక బిడ్డ ప్రవేశించెను. ఆటు వెనుక ఇంకొక బిడ్డ, తరువాత మూడవ బిడ్డ, ఇప్పటికి ఆయన అయిదుగురు బిడ్డల తండ్రి, సమయమంతా బిడ్డల మురికి గుడ్డలను ఉతుకు ఉద్యోగము చేయవలసి వచ్చెను. "నీ సేవ ఎందుకు ఫలించకున్నది" యని అడిగితివా, "ఇదంతా రాతినేల" యనును. ఉన్న సంగతి ఏమిటో దేవుని వాక్యము వెల్లడి చేయుచున్నది. ప్రాథమికమైన వాటికి ప్రధాన స్థానమివ్వవలెను. ఆయన కృప వలన ఇట్లు చేయగలము. అపొస్తలుల కార్యములు 6:5లో చెప్పబడినట్లుగా సేవకులకు దివ్యజ్ఞానము నొసగినట్లె మనకు కూడ నివ్వగలడు. "ఈ మాట యావన్మందికి ఇష్ట మైనందున," వారు స్తెఫను వంటి భక్తులను ఏర్పరచిరి. వీరు సందడి లేక, ఇంటింటిని దర్శించి అక్కడున్న వారికి సహాయము చేయుచు విధవరాండ్రను, బీదలను కనిపెట్టుచుండిరి. వారెక్కడ జన్మించిరో వారి వంశమేదో, ఎవరును ఎరిగి యుండలేదు. ఎక్కడెక్కడ వారి సేవ అవసరమై యుండునో అక్కడ నెమ్మదిగా ఆ సేవ చేసిరి. అయితే ఇతరులు వీరి నడతను పనిని గమనించుచుండిరి. ఏ అట్టహాసము లేక కార్యములు చేయుచుండిరి. మరియు ప్రతి కార్యము కొరకు పరిశుద్ధాత్మతోను, దేవుని జ్ఞానముతోను నిండియుండిరి. సమయమురాగా యావన్మంది ఏక మనస్కులై వీరిని ఏర్పరచుకొనిరి.

మనము చేయు కార్యము తక్కువైనను, గొప్పదైనను దానిని చేయుటకు మనకు పరిశుద్ధాత్మాభిషేకము కావలసియున్నది. విధవ రాండ్రకును, బీదలకును సేవచేయుట, మందిరమును చూచుకొనుట, ఆహారము వడ్డించుట, చాపలు పరచుట, దేవుని మందిరమందు ఇట్టి ఏ పనికైన గూడ పరిశుద్ధాత్మాభిషేకము కావలసియున్నది. మనము ఆ అభిషేకము పొందవలెను. దివ్యజ్ఞానముతో నింపబడవలెను. మనుష్యుల వలన మహిమ పొందుటకుగాదు, ఈ దైవాభిషేకము, పరిశుద్ధాత్మ జ్ఞానము మనకు ఎందుకు కావలెననగా దేవుని మందిరమందును, దేవుని పరిచర్యయందును చేయవలసిన పని ఏమని తెలిసికొనుటకు, ప్రతి దినమును మనుష్యులు చూచుటకు కాదు గాని దేవుని కొరకే చేయవలెను.

ప్రభువునకును, ప్రజలకును పరిచర్య చేయవలెనని స్తెఫను కోరెను. ఒక బోధకుడుగా కావలెనని ఆశించలేదు. కొందరు ఎట్టివారనగా బోధకులు కావలెనని కోరుటయేగాక వారి బోధలు ఆదివారము మాత్రమే చేయగోరుదురు. ఎందుకనగా ఆ దినమే చాలామంది కూడుకొందురు. చేతులు ఈలాగు, అలాగు ఊపుతూ ప్రసంగించునప్పుడు వారికి మహానందముగా నుండును. ఒక పెద్ద కూటములో మాట్లాడుమని పిలిచితే సంతోషముతో సమ్మతించి, "ఆహా, ఆ కూటము నడుపడానికి చాలా సంతోషమే" అందురు. ఒక గృహ కూటము జరుపమని ఈ వ్యక్తులనే అడిగితే "బ్రదర్ ఈ దినము నా ఒంట్లో అంత బాగుండలేదు" లేక "చంటిబిడ్డకు కొంత సుస్తీగా ఉంది. అందుకు ఈ దినము ఇంటికి త్వరగా వచ్చేయమని మా ఆవిడ చెప్పినది. దయచేసి క్షమించండి" అని అందురు స్తెఫను ఇట్టివాడు కాడు. ఒక బోధకునిగా ముందుకు రావలెనను భావము అతనికి లేదు. బల్లల దగ్గర పరిచర్య చేయుచు, ఆహారము వడ్డించుట, పేదలను కనిపెట్టుచుండుట అతనికి చాలును. ఇదంతయు సంతోషముతో

చేయుచుండగా అతడు పరిశుద్ధాత్మతోను జ్ఞానముతోను నిండియుండుట అందరు ఎరిగియుండిరి. ఎక్కడ ఎట్లు ప్రవర్తించవలెనో స్తెఫనుకు తెలియును. వినయ సాత్వికములతో, మృదువుగాను, జాగ్రత్తగాను మెలుగుట ఎట్లో అతనికి పరిచయమే. చిన్న చిన్న వాటిని చేయు రీతిలోనే జ్ఞానము వెల్లడియగును.

దేవుని వలన ఏర్పరచుకొనబడిన పాత్రగా నీవు కూడ నుండగోరెదవా? అయితే సర్వ సాధారణమైన పనులను మనుష్యుల కొరకు గాక దేవుని కొరకే సంతోషముతో చేయుటకు ఇష్టపడుము. అప్పుడు తన పరిశుద్ధాత్మతోను, జ్ఞానముతోను దేవుడే నిన్ను నింపును. ఈ విధముగానే స్తెఫను, దేవుడు ఏర్పరచుకొనిన పాత్రయాయెను. "స్తెఫను కృపతోను, బలముతోను నిండినవాడై ప్రజలమధ్య మహత్కార్యములను గొప్ప సూచక క్రియలను చేయుచుండెను" (అపొస్తలుల కార్యము 6:8). అతనికి అప్పగింపబడిన పని విధవరాండ్రను కనిపెట్టు వ్యవహారములలో వివరములు చూచుకొనుట, అయితే త్వరలోనే అతడొక గొప్ప విశ్వాసియనునది బయలుపడెను. వీళ్ళ దగ్గర వాళ్ళ దగ్గర డబ్బు భిక్షమడుగుచు ఇతడు తిరుగలేదు. "బీదలను విధవరాండ్రను చూచుకొనుమని యావన్మంది ఈ పని నాకు అప్పగించియున్నారు; యెరూషలేములోని విధవరాండ్ర సంఖ్య ఇంత, బిడ్డల సంఖ్య ఇంత, చంటిపాపల సంఖ్య ఇంత, ఇప్పుడు మీరిచ్చిన డబ్బు చాలదు, వారి పోషణకు మరికొంత ఇవ్వండి" అని ఇట్లు చెప్పుకొనగలిగి యుండవచ్చు. ఇక్కడ పేదరికమును కష్టములను వివరించి పెద్ద కథలు చెప్పుచు అమెరికాలో ఇక్కడ, అక్కడ సంచరించుచు, "ఈ విధవరాండ్రను, ఈ తల్లిదండ్రులు లేని బిడ్డలను పోషించడానికి డాలర్లు ఇవ్వండి" యని నేడు స్తెఫను అడుగుట కలలోనైనా తలంచగలరా! అమెరికనుల యొక్క డాలర్లను ముష్టి అడుగు బిచ్చగాండ్లారా! మీరు విశ్వాస పురుషులు కండి.

దేవుని యందు నమ్మకముంచుట ఎట్లో నేర్చుకొనుడి అయన ప్రేమ గలవాడు, శక్తిమంతుడు మారనివాడు. సర్వము అయనే చేయగలిగినవాడు అయన యొక్క సేవలో నున్నవారు భిక్షమెత్తె అవసరమున్నదా? విశ్వాసము శూన్యమైనందు వలన గదా ఈ పని చేయుచున్నారు. స్తెఫను విశ్వాసము గలవాడు. విశ్వాసము ద్వారా సకల అవసరములు తీర్చబడునట్లు చూచెను. దేవుడు మహత్కార్యములను స్తెఫను పక్షముగా చేసి, ఆ పని కొరకు తానే స్తెఫనును ఏర్పరచుకొనెనని ప్రకటించెను. దేవుడు నిన్ను ఏర్పరచుకొనెనా?

అయన చిత్తము చేయుట నీ కిష్టమైతే నిన్ను ఏర్పరచుకొని నిన్నొక విశ్వాసము గలవానిగా దేవుడు చేయును. దేవుని యొక్క మహత్కార్యములు జరుగుట నీవు చూతువు. అయన సజీవుడైన దేవుడు. "మాటలాడుట యందు అతడు అగుపరచిన జ్ఞానమును, అతని ప్రేరేపించిన ఆత్మను వారెదిరింపలేక పోయిరి." (అపొస్తలుల కార్యములు 6:10). అతనికి అప్పగింపబడిన పనులు చేయుచు, అదే సమయమున అతనిని కలిసిన వారందరికి స్తెఫను దేవుని వాక్యమును అందించుచుండెను. అతడు దీనస్థితి యందుండిన సాధారణమైన పురుషుడు. అయినను దేవుని ఆత్మతో నిండినవాడై అన్ని విద్యల నెరిగినవారి నోళ్లను మూయగలిగినవాడు. దేవునికి నీవు విధేయుడవు అయినప్పుడే అయన నీకు దైవజ్ఞాన మొసగి ఎట్టి పరిస్థితినైనను నీవు ఎదుర్కొన గలుగునట్లు చేసి నిన్ను ఒక ఏర్పరచుకొనబడిన పాత్రగా చేయును.

మనలో ప్రతి యొక్కరికి ఇది గాఢమైన కోరికగా నుండవలెను. నిన్ను ఏర్పరచుకొనబడిన ఒక పాత్రగా చేయుటకు అయన పిలుచుచుండగా అయనకు అప్పగించుకొనవా? శక్తితోను, దేవుని ఆత్మతోను నిండిన విశ్వాసివగుటకు ఇదే మార్గము.

## 4వ అధ్యాయము

# ఒక సాక్షిగా ఏర్పరచుకొనెను

స్తెఫను జీవితము ఉదహరించుటలో మనకు ఇప్పుడు బోధపడిన అంశము ఇది. మన యొక్క ఇష్టము, విధేయత, విశ్వాసముల మీదనే దేవుడు మనలను ఏర్పరచుకొనుట ఆధారపడియున్నది. ప్రభువు నన్ను ఏర్పరచుకొనుట నాకెంతో ఆశ్చర్యముగాను, ఘనమైనదిగాను, తోచు చున్నందున నా స్వంత అనుభవము చెప్పగోరుచున్నాను. ప్రభువు పిలుపు వినుటలో వారు తప్పిపోయినట్లు మనలను పిలుచుటకును మనతో మాట్లాడుటకును ప్రభువెట్టి సాధారణ పద్ధతుల నుపయోగించునో ఇతరులు కూడ గుర్తించవలెనని కోరుచున్నాడు.

కెనడా దేశమందు వినిపెగ్ పట్టణములో నేను 1930 సంవత్సరమున క్రీస్తు వాడనైన కొంత కాలమునకు ఒక ఆదివారము ఉదయమున ఆరాధనకు వెళ్ళితిని. కూటము ముగిసిన వెనుక నేను వెలుపలకు వచ్చి నిలుచుంటిని. ఒక సహోదరుడు వచ్చి నాతో కరచాలనము చేసెను. బలమైన అతని చేతి పట్టులో నా చేయి యున్నట్లు ఇప్పటికింకను నాకు తోచుచున్నది. "బ్రదర్ ఇండియాకు పోయి, ఎందుకు సువార్త ప్రకటింపకూడదు" అనెను. "బ్రదర్ నేనొక ఇంజనీర్‌ను, ఇన్ని ఏండ్లు ఇంజనీరింగ్ చదివితిని దీనికేమిగాని, నేనైతే నత్తివాణ్ణి, మరియు నలుగురి యెదుట నిలబడాలంటె గుండె దడ పట్టుకుంటుంది. వాళ్ళను చూచేటప్పటికే నా కాళ్ళు గజగజ వణుకును. నేనేమిటి? సువార్త పని చేయడమేమిటి?" అని నేనంటిని. అతడు ఇంకేమియు చెప్పలేదు. అయినను రెండు సంవత్సరముల వరకు ఆ మాటలు నాకు

తిరిగి తిరిగి జ్ఞాపకము వచ్చుచుండెను. అతడు ఇంకను నా చేతిని పట్టుకొనినట్లుగానే యుండెను. ఇంకను నా హృదయమందు, "వెళ్ళకూడదా? వెళ్ళకూడదా?" యని అతడు అడిగిన మాటలు మ్రోగుచునే యుండెను. అప్పుడు "ప్రభువా, నా డబ్బంతా నీకు ఇస్తాను. నాకొక మేడగాని మిద్దెగాని కట్టుకోవాలని ఆశ ఏమీలేదు. నాకు సుఖభోగాలు కూడా అక్కరలేదు. ఇదిగో, నీకు మాట ఇస్తున్నాను. నా డబ్బంతా నీకిస్తాను. ఆ డబ్బుతో ఎంతోమంది బోధకులకు జీతాలిచ్చి పంపగలను. నన్ను మాత్రము పొమ్మని చెప్పవద్దు. నన్ను ఒక బోధకునిగా దయచేసి చేయవద్దు" అని ప్రభువుతో చెప్పితిని.

దేవుడు ఏమనెననగా, "నీ డబ్బు నాకు అవసరము లేదు. నాకు నీవే కావలెను." రెండు సంవత్సరములు ఈ మాటలు తిరిగి తిరిగి వింటిని. నాకంతయు అయోమయముగా నుండెను. ఈ నత్తి, ఈ పిరికితనము, ఈలాంటి బలహీనతలతో నున్న వ్యక్తి ఒక సభ ఎదుట మాట్లాడుటకైనను సాధ్యమగునా? నా కిష్టము వచ్చినట్లు నా నాలుకను నేను ఉపయోగించలేను. ఒక్క పాటయిన పాడలేను. సంగీతమందు సరిగమలు కూడా రావు. ఇటువంటి మనుష్యుడు సభలలో మాట్లాడుట ఎట్లు? దేవుని సేవకొరకు పైకమిచ్చి ఆయనను సేవింపగలను అనుకొంటిని. బుద్ధిహీనుడనై మ్రుడ్డివాదినై, రెండు ఏండ్లు పూర్తిగా దేవునితో వాదించుచు వెళ్ళితిని. ఇట్లు చేయుచుండుట కూడ నాకు తెలియలేదు. పని విడిచి పెట్టుట మంచిది కాదనుకొంటిని. అయితే నాకంటె దేవుడు ఎక్కువ తెలిసినవాడు. ఆయన ప్రేమ, దీర్ఘశాంతము, సహనము ఎంతటివనగా ఆయనను మనము దు:ఖపరచినను, ఆయన పట్ల తప్పినను, ఆయనను గాయపరచినను మనలను మట్టుకు విడనాడడు. మనలను ఆయన ఎందుకు ఏర్పరచుకొనుట అనునది ఒక మర్మమే. అనగా మనమీద ఆయన హక్కు గలదు. ఆయన నా సృష్టి కర్త, శక్తిమంతుడైన

దేవుడు గనుక ఈ విషయము ఆయన ఎరుగును. ఎప్పుడైతే మనము ఆయనకు లోబడి, విధేయులమై ఆయనను వెంబడింతుమో అప్పుడు మనలో, మన ద్వారాను పని చేయుచున్న ఆయన శక్తిని మరింత చక్కగాను, సంపూర్ణముగాను తెలిసికొందుము.

రక్షణ విషయము కూడ ఇంతే. ఘోరపాపినైన నన్ను దేవుడు ఏర్పరచుకొనుటకు కారణమేమి? బైబిలు మీదను క్రైస్తవుల మీదను నాకుండిన ద్వేషమును చూపించుటకై, 1919 సంవత్సరమున గ్రుడ్డితనములో పరిశుద్ధ గ్రంథమును (బైబిలును) నేను చింపివేయుట జ్ఞాపకమున్నది. దేవునికి విరోధముగాను అయన ప్రజలకు విరోధముగాను దేవదూషణ చేసితిని తుదకు పాడు అలవాట్లకు బానిసనైపోతిని. అయినను తన్ను తాను నాకు ప్రత్యక్షపరచుకొనప్పుడు నా ప్రభువు, "నీవు ఈ అక్రమము చేసియున్నావు, ఆ అక్రమము చేసియున్నావు" అని నన్ను ఖండించనేలేదు. అయితేనేమి? నా పాపములన్నియు నాకు కనబడినవి. ఆయన సాన్నిధ్యమే నా సమస్త పాపములను బయటపెట్టెను. నీవది చేయవలెను నీవది చేయరాదు. అని నాతో చెప్పినవారు ఒకరును లేరు. ఆయన సాన్నిధ్యమే నా చెడు కోరికలు నన్ను వదిలి పోవునట్లు చేసెను. ఆయన నా యొద్దకు వచ్చెను. ఆయన యొద్దను నేను వెళ్ళినవాడను కాను. ఎందుకనగా ఆయనకు మరింత దూరముగా వెళ్ళుచుంటిని. నావీపే ఆయన వైపుండెను. ఇట్లుండగా నాకు తెలియకుండనే ఆయన అడుగడుగునా నన్ను వెంటాడుచు వచ్చుచుండెను.

1929, డిసెంబరు 16వ తారీఖున గొప్ప దేవుడు నాతో చెప్పిన ఈ మాటలకై ఆయనకు నా వందనములు : "ఇది నీ కొరకు విరువబడిన నా శరీరము ఇది నీ పాప క్షమాపణ కొరకు చిందింపబడిన నా క్రొత్త నిబంధన రక్తము" నేను ఏ కూటమునకు వెళ్ళియుండలేదు; నాకొక సువార్తనిచ్చిన వారుగాని, నాతో మాట్లాడిన వారుగాని యుండలేదు. "రక్షణ" లేక "క్రొత్త

జన్మము" అను మాటల యొక్క అర్థము ఏమిటో నాకు తెలియదు. మత్తయి, మార్కు, లూకా, యోహాను ఎవరో నాకు తెలియదు. మత్తయి అనగా నేమిటో? ఒక పురుషుడా, స్త్రీయా లేక పట్టణమా అని కూడ ఎరుగను. మీరు నవ్వవచ్చునేమోగాని నా అజ్ఞానము అంతటిదని చెప్పుచున్నాను. ఆ ఉదయమున ప్రభువు నా పాపములను బయటపెట్టగా, నేను : నాకేమైనా నిరీక్షణ ఉన్నదా? డబ్బు వుందిగాని సమాధానము లేదు; విద్య వుందిగాని నా జీవితమంతా అపజయమే; పైకి సంస్కారము గలవాడనే, లోపల పచ్చిదొంగను. ప్రభువా, నాకేమైనా నిరీక్షణున్నదా?" అని యంటిని.

అప్పుడు ఆయన స్వచ్ఛముగాను, తేటగాను, ప్రేమ పూర్వకముగాను ఈ మాటలు పలికెను. "ఇది నీ కొరకు విరువబడిన నా శరీరము, ఇది నీ పాప క్షమాపణ కొరకు చిందించబడిన నా క్రొత్త నిబంధన రక్తము." అప్పుడు తిరిగి నేను, "ఓ దేవా, నీవు చెప్పిన మాటలు నాకు అర్థము కావడములేదు. నేను వట్టి మొద్దును" అని అంటిని. ఆయన మరల ఇట్లు చెప్పెను, "నా కుమారుడా వెళ్లుము, నీ పాపములు క్షమింపబడినవి." సంగతి పరిష్కారమయ్యెను. ఈ విధముగా ఆయన నన్ను ఏర్పరచుకొనెను. దేవ దూషకుడనైన నన్ను, ప్రతి పాపమునకు దాసుడనైన నన్ను ఆత్మీయముగా కేవలము అంధుడనైన నన్ను ఆయన వెదకి, ఏర్పరచుకొనెను. ఆయన నావాడనియు, నేను ఆయన వాడననియు నేను ఎరిగి నమ్ముచున్నాను. రక్షకుని ప్రేమ పూర్వకమైన స్వరము నీవు కూడ విందువు గాక. ఆయనకు విధేయుడవగుచు, ఆయనను వెంబడించుచు నీవు వెళ్ళుచున్న కొలది తానే తన చిత్తమును నీకు నేర్పును.

స్తెఫనును దేవుడు ఎట్లు ఏర్పరచుకొనెనో చూచియుంటిమి. మరియు కీర్తన 106:4,5లో కీర్తనల గ్రంథకర్త ఆశించిన మూడింటిని కూడ చూచితిమి. "నీవు ఏర్పరచుకొనిన వారి క్షేమము నేను చూచుచు, నీ జనులకు కలుగు

సంతోషమును బట్టి నేను సంతోషించుచు, నీ స్వాస్థ్యమైన వారితో కూడి కొనియాడుచుండుట" ఇది ఆత్మతో చేయు సత్య ప్రార్థన. మనము తరచుగ చేయు ప్రార్థన లోకసంబంధమైన వాటికొరకే. చదువుకొను దినములలో పరీక్షకు ముందు, "దేవా నేను ఉత్తీర్ణుడగుటకు సహాయము చేయుము" అని ప్రార్థన చేయుదుము. యౌవన స్త్రీ పురుషులు - "ప్రభువా, నాకొక భర్తనిమ్ము" లేక "ఒక భార్యనిమ్ము" "అయితే, పెద్ద చదువు చదివిన వ్యక్తి కావలెను. కనీసము బి.ఎ. అయి యుండవలెను" అని ప్రార్థన చేయుదురు. సాధారణముగా యువకుడు కోరు స్త్రీ ఎక్కువ లావు ఉండకూడదు. చాలా పొడవుగా కూడ నుండరాదు. కొంత మంచి ఛాయ కలిగినదై యుండవలెను. అయితే తప్పక కళాశాలలో యోగ్యతా పత్రము పొందియుండవలెను. ఈయన గారేమో మసిబొగ్గు నలుపు మెట్రిక్కులో తప్పినవాడు! మరికొందరు ఉద్యోగము కొరకు లేక ప్రమోషనుల కొరకు ప్రార్థనలు చేయుదురు. నిత్యత్వమునకు నిలిచియుండునట్టి అసలైన వాటి విషయము తలంచకుండా నశించిపోవువాటి కొరకే ప్రార్థన చేయుదురు. కీర్తన 106:5 లోని మాటలతో వారు ప్రార్థన చేసినచో, అడిగిన దానితో పాటు ఇతరమైన సమస్తమును దేవుడిచ్చును.

ఏ విధముగా స్తెఫనును దేవుడు ఏర్పరచుకొనెనో చూచితిమి. అతడెవరో, అతని కుటుంబము ఏమిటో, అతని తల్లిదండ్రులెవరో మనకు తెలియదు. అయినను హఠాత్తుగా ప్రత్యక్షమగుచున్నాడు. ఏర్పరచుకొనబడిన ఈ పాత్ర ఏమి చేయుచుండుట కనబడుచున్నదనగా, సాధారణమైన పనులు; ఏ బహుమానము కొరకునుగాక, బీదలను, విధవరాండ్రను సేవించుట యనునవి. ఇతడు సామాన్యమైన వ్యక్తికాడని ఇతరులు తెలిసికొనపోగిరి. అతని కోరిక దేవుని సంతోషపెట్టుట; అతని జీవితము విజయపూరితము. దేవునికి లోబడి యుండుటకు తీర్మానించుకొనిన పాత్రైనందున స్తెఫను

పరిశుద్ధాత్మతో నిండుకొని, పరిపూర్ణ విశ్వాసము శక్తి గలిగియుండెను. దేవుడు ఏర్పరచుకొనెను సమస్తమైన వారికి కలుగు భాగ్యమిదే. దేవుని చిత్తము జేయవలెనను కాంక్ష నీ హృదయమందుండిన యెడల ఆయన కొరకు కనిపెట్టుము; ఆయన తన కిష్టమైన రీతిగా నీ కోరికలు నెరవేర్చును. నీ ఆశల విషయము అరచుట, పోట్లాడుట నీవు చేయవలసిన కార్యము కాదు. ఆయనకు విధేయుడవై, ఆయన వాక్యమునకు లోబడి, దానిని నీ హృదయములో చేర్చుకొనుము. నీవు కోరిన సుగుణములు, నీ జీవితమందు ప్రత్యక్షపడుట నీవే చూతువు. ఆయన సంకల్పము చొప్పున నీవు ఆయన వలన ఏర్పరచుకొనబడిన పాత్రవగుదువు.

అపొస్తలుల కార్యములు 6:13,15 వచనములలో యూదుల నాయకులు స్తెఫనుకు విరోధముగా అబద్ధ సాక్షులను నిలువబెట్టినట్లు చూచుచున్నాము. పెద్దలు, శాస్త్రులు రేపబడుట వలన స్తెఫనును వారు పట్టుకొని మహాసభ యొద్దకు తీసికొని పోయి, అతని మీద నేరములు మోపసాగిరి. ఇట్లు వారు అబద్ధ విషయములు చెప్పుచుండగా సభలో కూర్చున్న వారందరు స్తెఫను వైపు తేరిచూడగా, అతని ముఖము దేవదూత ముఖము వలె ప్రకాశించుచుండినందున ఆశ్చర్యపడిరి ఒంటరిగా నున్నవారి మీద అందరును విరోధముగా తిరిగియుండిరి. మహాసభ సమస్తము అతనికి విరోధముగా నుండెను. వీడు, వాడు, ప్రతియొక్కడు, స్తెఫనుమీద అబద్ధ నేరములు మోపిరి. అతని ముఖము చూడగా దేవదూత ముఖము వలె ప్రకాశించుచుండెను. హింస కలుగుచుండగా మరింత కాంతితో ప్రకాశించెను. ఎటువంటి రక్షణ! ఎటువంటి పాత్ర! అట్టి ప్రకాశమైన ముఖము కలిగియుండుట ఎంతటి భాగ్యము!

లోకములో చూచిన ఎడల చక్కదనము కొరకు ఎంతో డబ్బు ఖర్చు చేయుచున్నారు. స్త్రీలేమి, పురుషులేమి సౌదర్యమునిచ్చునని చెప్పబడు

క్రీములను (creams), పౌడర్లను, సబ్బులను ఉపయోగించుచున్నారు. స్త్రీలు పౌడరుతో, క్రీముతో మెరయుచున్న ముఖములతో వెలుపలికి వచ్చు నిమిత్తము నగర మందు అతివన్నె కెక్కిన సౌందర్య మధికము గావించు శాలలను (beauty parlours) దర్శించి, అరగంట, అంతకంటె ఎక్కువ సమయము కూడ అక్కడ గడుపుచున్నారు. ఈ సౌందర్యము కొంతసేపటికే. ప్రాతఃకాల భోజనమునకు వెళ్ళినప్పుడు చల్లారిపోయిన చద్ది ఉప్మా వడ్డించిన ఎడల వెంటనే ఆ ముఖము రంగు మారుచున్నది. "ఇంత చక్కగా మార్చి వేసికొని ఉంగరాలు చుట్టి తల దువ్వుకొని, ఇంత మంచి బట్టలు తొడుగుకొని, మెరుస్తున్న ముఖముతో వచ్చి కూర్చుంటే నాకీ చద్ది ఆహారము వడ్డించడానికి చేతులు ఏలాగు వచ్చినవి?" అని బహుశ తలంచుచుండవచ్చును. ఆ మెరుస్తున్న ముఖము ఇప్పుడు ఏమైనది?

ఇతరులు నీకు విరోధముగా మాట్లాడుట నీవు వింటివేమో? లేక ఎవరో నీ విషయము అవమానకరమైన అసత్యపు మాటలు చెప్పినట్లు ఒక పుకారు నీకు వినబడెనేమో, ముఖము వాల్చుకొని ఇంటికి వచ్చుచున్నావు. "వచ్చి భోజనము చేయండి" యని నీ భార్య పిలుచును, "నాకు ఆకలి లేదు" అనుచున్నావు. ఎన్ని మారులు ఆమె పిలిచినను అదే జవాబు ఇచ్చుచున్నావు. నీకు నిద్ర పట్టుటలేదు. నిట్టూర్పులు విడుచుచు తిరుగుచున్నావు. అయినను ఎప్పుడైతే దేవుని వలన ఏర్పరచుకొనబడి అభిషేకింపబడిన పాత్రవగుదువో, అప్పుడు నీకు అన్యాయము జరిగిన కొలది నీ ముఖము, అంతకంతకు ఎక్కువగా ప్రకాశించును. ఇతరులు నిన్ను ద్వేషించుచు, నీ విషయము అబద్ధపు సంగతులు చెప్పినను నీ ముఖము దేవదూత ముఖమువలె ప్రకాశించును. చల్లారిన కాఫీ. చద్ది ఫలహారము నీవు పుచ్చుకొనినను నీ ముఖము కాంతిగానే యుండును. ప్రతి విశ్వాసికి ప్రకాశమానమైన ముఖమును అనుగ్రహించుట దేవుని యొక్క

ఉద్దేశమును, ఏర్పాటునై యున్నది.

ప్రభువైన యేసుక్రీస్తు నొద్దకు మనము ముందురాగా ఆయన వెలుగు మన హృదయమందు ప్రవేశించును. పిమ్మట ముఖము మీద, అటువెనుక మనము నడుచు మార్గముపైన పడును. ఇది మూడంతల దివ్యకాంతి. ఈ రీతిగా చూస్తే, నీవు దేవుడు ఏర్పరచుకొనిన పాత్రవేనా? ఈ విధముగా నీ భార్య చెప్పుటకు నీ ముఖము అంత ప్రకాశముతో నున్నదా? "ఇతడు నిజముగా నా భర్తేనా? అదే మనుష్యుడేనా? మునుపు ఆ ముఖము, ఎంత కఠినముగా ఉండేది? ఇప్పుడు ఆ చూపులో ఎంత ప్రేమ, ఎంత దయ? ఏమి జరిగినది? నీకు ఆ తేజోవంతమైన ప్రభువే. బోధకులు, ప్రసంగములు కావు. సజీవుడైన దేవుడే. ఇట్లయినచో పరీక్షలు, కష్టములు, బాధలు, ఏవైనను రానిమ్ము, నీ ముఖము దినదినము అంతకంతకు అధికముగా మెరయును. ప్రకాశమైన ముఖముతోనే శత్రువును ఓడింప గలుగుదుము. స్తెఫను పక్షముగా వాదించుటకు ఒక న్యాయవాది అవసరము లేదు. అతని న్యాయవాది ప్రకాశమైన అతని ముఖమే. నీ విషయమైనను ఇదే కావలెను. ఇతరులు నిన్ను ద్వేషించినను, హింసించినను, నిన్ను తిప్పలు పెట్టినను నీ ముఖము మీద ఆ వెలుగు ఉండవలెను. అదే ఇతరులకు నిన్ను గూర్చిన ప్రకటన, నీ యొక్క సాక్ష్యమునగును (2 కొరింథీ. 4:6). నీవు దేవుని కొరకు కనిపెట్టుచుండగా మరింత వెలుగు నీ ముఖము మీద నుండును. నీకేమీ తెలియకుండును గాని దేవుని యొక్క వెలుగు నీ ముఖము మీద ప్రకాశించుట ఇతరులకు కనబడును. ఆనాడు నీవు పడు బాధల కొరకు కూడ దేవునికి వందనములు చెల్లింతువు.

తన పక్షముగా స్తెఫను ఏ విధముగా వాదించుచున్నాడో అపొ.కా 7:2లో గమనించుము. " ఓ శత్రువా, ఆలకించుము." అని ఇట్లేమైనా అనుచున్నాడా? లేదు. ఈ విధముగా చెప్పుచున్నాడు. "సహోదరులారా

తండ్రులారా వినుడి." ఆ సమూహమంతయు అతనికి విరోధముగా ఏకమైయుండగా మెరయుచున్న ముఖకాంతితో వారిని "సహోదరులారా" అని పిలుచుచున్నాడు. మనస్సునందు వారి తలంపులు ఏమైయుండునో స్తెఫను ఎరిగి యుండుట చేత, ఈ వర్తమానమును వారికి జవాబుగా నిచ్చెను. "అబ్రాహాము హారానులో కాపురముండక మునుపు మెసొపొతమియలో ఉన్నప్పుడు మహిమ గల దేవుడు అతనికి ప్రత్యక్షమై," దేవుని 'మహిమ గల దేవుడు' అనుచున్నాడు. తమ పితరులను బట్టి యూదులు బహుగా అతిశయించుచుండిరి. "మా అబ్రాహాము, మా ఇస్సాకు, మా యాకోబు, మా మోషే"ఈ విధముగా చెప్పుట వారికి అభ్యాసము. అయితే అబ్రాహాముకు దేవుడు ఏల ప్రత్యక్షమాయెనో ఆ విషయము ఎరుగరు. అనేకమంది క్రైస్తవులున్నారు. వారు; "మేము అజ్ఞానులము కాము : మేము క్రైస్తవులము." అని గొప్పగా చెప్పుకొందురు. 'క్రైస్తవ' అను పదము ఏమి అర్థమిచ్చుచున్నదో అది మట్టుకు ఎరుగరు యూదుల స్థితికూడ ఇట్లే యుండెను. అబ్రాహాముకు ఎట్లు, ఏల దేవుడు ప్రత్యక్షమాయెనో వారికి తెలియదు. పరిశుద్ధాత్మతో నింపబడిన స్తెఫను ఆ విషయమును ప్రకటించు చున్నాడు. "అబ్రాహాముకు ... మహిమ గల దేవుడు ప్రత్యక్షమాయెను" అని ప్రారంభించుచున్నాడు. ఎందు నిమిత్తము? ఇదే మహిమను అబ్రాహాము యొక్క సంతానమైన జనాంగము పొందవలెనని. ఇశ్రాయేలీయులైతే అంతయు మరచిపోయి యుండిరి. ప్రారంభము నుండియు తన మహిమతో వారు నింపబడవలెనను నదియే దేవుని యొక్క ఏర్పాటైయుండెను. ఈ కారణము చేతనే అరణ్యమందు ప్రత్యక్ష గుడారములోను, అటు తరువాత యెరూషలేము నందు దేవాలయపు నిర్మాణము పూర్తి కాగా "యెహోవా తేజస్సు మందిరమును నింపెను" అని చదువుచున్నాము (నిర్గ కాం. 40:34;2 దినవృత్తా 7:1). సొలొమోను దేవాలయము, ప్రత్యక్ష గుడారము

రెండును దేవుని మహిమతో నింపబడెను. దేవుడు వెండి బంగారములను అడుగలేదు గాని తన మహిమతో నింపుటకు ఒక స్థలము వారిని ఇమ్మనెను. ఇశ్రాయేలు జనులు తామే ఎట్లు మహిమతో నింపబడగలరో ఆ విషయము వారికి నేర్పబడెను. అదంతయు వారు పూర్తిగా మరచిపోయిరి. వారి దృష్టి తమ మీదనే నిలిచియుండెను. మరియు వారి అతిశయమంతయు దేవాలయమే. వారి యొక్క వైభవము మీదను, చేతితో నిర్మించిన ఆలయము విషయమే. అయితే మహిమగల దేవుడు వారు తన తేజస్సును చూడవలెననియు, ఆ తేజస్సుకు వారే నిలయము కావలెననియు వారికి ప్రత్యక్షమాయెను. చేతితో నిర్మించిన కట్టడములందు దేవుడు నివసింపడు. సజీవమైన ఆలయమునందే నివసింప గోరుచున్నాడు. "మనము జీవము గల దేవుని ఆలయమై యున్నాము," (2 కొరింథీ 6:16). "నేను వారిలో నివసించి సంచరింతును" అని దేవుడు అనుచున్నాడు దేవుడు తన ప్రజలను తన నివాస స్థలముగా చేసికొనుటకు ఆయన యొక్క నియమములను వారు నేర్చుకొను నిమిత్తము ఆయనకొక ఆలయము కావలసియున్నది ఒక్క క్షణము మాత్రమే వారు దేవుని మహిమను చూతురని గాక ఆ మహిమతో నింపబడి నిత్యత్వమునకు ఆ తేజోనిలయమై యుండుటయే అని దీని భావము.

నిన్ను ఏర్పరచుకొనుటలో దేవుని యుద్దేశమేమి? నీ డబ్బు, బంగారు, వెండి అవసరము లేదు; నీవే ఆయనకు కావలెను. ఆయన మహిమతో నీవు నింపబడి, ఆయన సన్నిధి నీకు తోడైయుండి, నీవు క్రొత్త జీవించుటకును, క్రొత్తనడక నడుచుటకును నీవు ఆయనకు అవసరమై యున్నావు. ఆయన తేజస్సు నీలో ప్రవేశించు నిమిత్తము నీ శరీరము ఆయనకు ఆలయముగా నుండవలెనని కోరుచున్నాడు. ఆయన నిన్ను ఏర్పరచుకొనుటలో గల కారణము ఇదే.

నీవు దైవ మహిమతో నింపబడుటకు ఇష్ట పూర్వకముగా కోరుకొనుచూ సిద్ధపడియున్నావా? అట్లు కోరిన యెడల నీవు ఏ స్థలమందైనను స్నేహితుల మధ్యనో, శత్రువుల మధ్యనో, ఒంటరిగానో, కష్ట పరిస్థితులలోనో, ఎక్కడున్నను నీ ముఖము ప్రకాశించును. నీ కుటుంబము ఎట్టి వాతావరణములో, ఎట్టి స్థితిగతులలో నున్నను, ఆరోగ్యముగా నున్నను లేక వ్యాధిలో నున్నను నీ ముఖము ప్రకాశించును. ఏల? మహిమ గల దేవుని నీలోనికి రానిచ్చినందుకు నీ హృదయము ఆయన ఆలయమాయెను. దేవుడు నీలోపల నివసించుట అను సత్యమేమిటో నీవు గ్రహింపగలవు.

ఆలయ మహిమను మనము చూచునట్లు, అది మన ముఖముల మీద ప్రతిబింబించునట్లు దేవుడు మనకు సహాయమొనర్చు గాక!

## 5వ అధ్యాయము

# ఆయన మహిమార్థము ఏర్పరచుకొనెను

కీర్తనల గ్రంధకర్త ఆశించిన మూడు విషయములు చూచితిమి. దేవుడు ఏర్పరచుకొనిన వారి క్షేమమును చూచుట, ఆయన జనులకు కలుగు సంతోషమును బట్టి సంతోషించుట. ఆయన స్వాస్థ్యమైన వారితో కూడి కొనియాడుట. ఇప్పటికే మనము "నీవు ఏర్పరచుకొనిన వారి క్షేమము నేను చూచునట్లు" అను మొదటి భాగమును ధ్యానించితిమి. అవశ్యకమైనది, ఏమనగా, దేవునిచే ఏర్పరచుకొనబడిన పాత్రయై ఆయన చేతిలో నుండుట దీనికి మనము ఇష్టపడవలసి యున్నది. ఈ మొదటి అడుగు వా[illegible]షిమ్మట.

మిగిలిన రెండు అనుభవములలోనికి ప్రభువు మనలను ఎట్లు తెచ్చునో స్పష్టపరచబడుచున్నది. ఒక అనుభవము ఇంకొక దానిలోనికి నడుపును ; ఇది మనకు స్పష్టపరచు నిమిత్తమై స్తెఫను యొక్క జీవితమును మనకు కనబరచుచున్నాడు.

ఇప్పుడు "నీ జనులకు కలుగు సంతోషమును బట్టి నేను సంతోషించునట్లు" అను రెండవ కోరికను ధ్యానింతుము. అపొస్తలుల కార్యములు 7:1,2 తిరిగి చూతము. ప్రధాన యాజకుడు, "ఈ మాటలు నిజమేనా" అని అడిగెను. అందుకు స్తెఫను చెప్పినదేమనగా "సహోదరులారా, తండ్రులారా వినుడి. మన పితరుడైన అబ్రాహాము హారానులో కాపురముండక మునుపు మెసొపొతమియలో ఉన్నప్పుడు మహిమగల దేవుడు అతనికి ప్రత్యక్షమై." దేవుడు ఏర్పరచుకొనిన పాత్రను శత్రువు ఏ విధముగా హింసించెనో చూచితిమి. మరియు అబద్ధ నేరములు అతని మీద వారు మోపుచుండగా దేవదూత ముఖము వలె అతని ముఖము ప్రకాశించెనని కూడ చూచియుంటిమి. ఇదేమి వింతయని అందరు ఆశ్చర్యపడిరి. ఇదేమి వింత కాదని వారు గ్రహించునట్లు తన జనులను మహిమలోనికి తెచ్చు నిమిత్తమే, ఆది నుండియు దేవుని ఏర్పాటుని స్తెఫను దేవుని పాత్రయైనందున లోతైన అర్థముతో ఆ మాటలు చెప్పెను. వారిని దేవుడు ఏర్పరచుకొనుటలో ఆయన సంకల్పమేమిటో తెలుపుటకు 1 నుండి 50 వచనములలో ఇశ్రాయేలు జనుల సర్వ చరిత్రను స్తెఫను వివరించెను.

ఈ కథను ఏడు దృష్టాంతములుగా మనము విభాగించవచ్చును. మొదటి మూడింటికి అబ్రాహాము, ఇస్సాకు, యాకోబు దృష్టాంతముగా నున్నారు. ఈ ముగ్గురి నుండి చరిత్ర బయలుదేరి ఐగుప్తు, అరణ్యము, కానాను, సొలొమోను నిర్మించిన దేవాలయము వరకు వెళ్ళుచున్నది. స్తెఫను అబ్రాహాముతో ప్రారంభించి సొలొమోనుతో ముగించెను. కోపాగ్నితో మండుచున్న ఆ వినువారలు స్తెఫనును అంతకంటె ఎక్కువ చెప్పనివ్వలేదు.

అయినను ఈ అపవాదకులకు తెలుపవలసిన అంశములు ఆ చెప్పబడిన భాగమందే యుండెను. పర సంబంధమైన సంతోషము వారు పొందవలెనని దేవుడు తన ప్రజలకు సిద్ధపరచుచుండిన రహస్యమును స్తెఫను వెల్లడి చేసెను (2 దినవృత్తా. 7:1-3). దేవుని ప్రజలై యుండిన ఆ జనులకు ఆ దినమువంటి మహా సంతోషకరమైనది వేరొకటి యుండలేదు. ఎందుకనగా ఆ దినము వారి చరిత్ర యొక్క శిఖరమును ఆక్రమించెను. సొలొమోను దేవాలయము దేవుడు కనబరచిన పరలోకపు మాదిరి ప్రకారము కట్టబడి, పూర్తిమైన సమయమందు పైనుండి అగ్ని దిగి ఆ బలులను దహించివేసెను. దేవాలయము అంతయు దేవుని తేజస్సుతో నిండెను. ఇశ్రాయేలీయులందరు సాష్టాంగ నమస్కారము చేసి, యెహోవాను పూజించి స్తుతించిరి. ఇటువంటిది వారెన్నడు చూచి ఎరుగరు : కావున పరలోక సంతోషభరితులైరి. బలవంతుడును, సజీవుడునైన దేవుడు, పరిశుద్ధుడును, ప్రేమమూర్తియునైన దేవుడు, తన సంపూర్ణ మహిమతో వారి మధ్య దిగిన ఆ దినము నిజముగానే ఇశ్రాయేలీయుల చరిత్ర యందలి అత్యానంద దినము. ప్రతి హృదయము సంపూర్ణ సమాధానముతో నిండియుండెను. అప్పటికి వారి శత్రువులందరు అణపబడి యుండిరి. రాజ్యమందంతటను నీతి సమాధానములతో నిండి యుండెను. దైవ సాన్నిధ్యము మందిరమును నింపెను. ఇట్టి సంతోషానందములనే కీర్తనల గ్రంధకర్త కీర్తన 106లో చూడగోరి, ఇట్లు ప్రార్ధన చేసెను : "నీ జనులకు కలుగు సంతోషమును బట్టి నేను సంతోషించునట్లు". ఇది పరలోక సంబంధమైన సంతోషమే గాని భూ సంబంధమైనది కాదు. ఈ సంతోషము ఈ భూలోక వాసులెల్లరితో పంచుకొనుటకు వీలుపడదు. సజీవ దేవుడు తన ప్రజల మధ్య నివసించి కార్యములు నెరవేర్చినప్పుడు గలుగు సంతోషమునే కీర్తనల గ్రంధకర్త కోరెను.

ఈ పదవికి ఇశ్రాయేలీయులు ఎట్లు వచ్చిరి? దేవుడు ముందు అబ్రాహామును పిమ్మట అతని ద్వారా ఇస్సాకు, యాకోబులను ఏర్పరచుకొనెను.

యాకోబు జీవిత కాలమునందు వారందరు ఐగుప్తుకు వెళ్ళిపోయిరి. అచ్చటనుండి అరణ్యముకు వచ్చిరి. నలుబది ఏండ్లు అరణ్యమందు తిరిగిన తరువాత వాగ్దానము చేయబడిన కానాను దేశమునకు వచ్చిరి. ఈ దేశమందు సహితము వారు అనేక సంవత్సరములు బాధలనుభవించుచు కనిపెట్టుచుండిరి. తుదకు దేవుడు తన మందిరమును తన తేజస్సుతో నింపిన సమయమందు ఆ దేవాలయములో ఆయన యొక్క ఏర్పాటు పూర్తి యగుటను గాంచిరి.

తన కార్యము కొరకు తన జనులను దేవుడు ఏర్పరచుకొను విషయములో ఒక లోతైన అర్థమున్నది. అబ్రాహాము యొక్క భార్య, ఇస్సాకు యొక్క భార్య, యాకోబు యొక్క భార్యయైన రాహేలు గొడ్రాండ్రుగా యుండుటలో అర్థమేమైనా నుండెనా? మనంతట మనమే ఏ ఫలము ఫలించలేమని దేవుడు చూపుచున్నాడు. లోకమందు పాపము ప్రవేశించి సర్వలోకమును నిష్ఫలముగా చేసెను. మరియు అది ఫలించునట్లు చేయుట మానవుని తరముకాదు. పాపము వలన మనము కూడను బీడు భూమివంటి వారమగుట తప్పదని గ్రహించుట కొరకే ఇశ్రాయేలీయులు అనేక సంవత్సరములు ఫలము లేనివారై యుండిరి. ఒకడు సమృద్ధిగా డబ్బు సంపాదించవచ్చును లేదా ఒక ఉన్నత పదవిని అలంకరింపవచ్చును. అయినను అతని జీవితమందు దేవుని కొరకు ఏమియు నుండని ఎడల ఆయన దృష్టిలో ఫలము లేని బీడుభూమి వంటివాడే. నిత్యత్వమునకు స్వాభావికముగా సారములేని, ఫలములేని వారమను ఈ మొదటి పాఠమును మనము నేర్చుకొనవలెనని దేవుడు కోరుచున్నాడు.

అద్భుతరీతిగా అబ్రాహాము వృద్ధాప్యమందు దేవుడు అతనికొక బిడ్డను అనుగ్రహించెను. అబ్రాహాము, అతని భార్యయు ఇరువురును ముసలివారై పోయినందున వారికొక శిశువు కలుగుట అసాధ్యమని ఆశలు వదలుకొని యుండిరి. ఎండిపోయిన మ్రానుయెంతో ఏరు కూడ అంతేయై

యుండిరి. అయినను దేవుడు వాగ్దానము చేసియుండెను. అయన తన మాట మీరువాడు కాడు గనుక వారి శరీరములో కొత్త జీవమును ప్రవేశపెట్టెను. ఈ రీతిగా ఇస్సాకు జన్మించెను? ఈ జన్మము పునరుత్థాన శక్తిని తెలుపుచున్నది. అనగా మరణమును జయించు శక్తిని తెలుపుచున్నది. నీవు ఫలించుట వలన సంతోషమును, పరలోక సంతోషమును కోరెదవా? అట్లయితే నీవు ముందుగా ఆయన పునరుత్థాన శక్తిని ఎరుగవలెను. మరియు నీ జీవితమందున్న మరణమును గొడ్డుతనమును నీవు జయించుటకు ఈ శక్తి నీ అందుబాటులోనే యున్నది అను విషయము కూడ తెలిసికొనవలెను. ఇందుకే మన ప్రభువు మరణించి, తిరిగి లేచెను, ఆయన సిలువ మీద వ్రేలాడుచుండగా, "నీవు దేవుని కుమారుడవైతే సిలువ మీదినుండి దిగుము. దిగిన ఎడల నమ్ముదుము" అని కొందరనిరి, గాని ఆయన దిగిరాలేదు. ఆయన మరణించి, పాతి పెట్టబడి తిరిగి లేచెను. ఏల? తన పునరుత్థాన శక్తిని మనకు లభింపచేయవలెననియే.

ఇస్సాకు మరొక అనవాలు : "యెహోవా అతనిని ఆశీర్వదించెను గనుక ఆ మనుష్యుడు గొప్పవాడాయెను" (ఆదికాండము 26:12). అబీమెలెకు - "నీవు మాకంటె బహు బలము గలవాడవు గనుక మా యొద్దనుండి వెళ్ళిపొమ్మని ఇస్సాకుతో చెప్పెను" (వచనము 16). ఇస్సాకు దేవుని వలన ఏర్పరచుకొనబడిన పాత్రయై యుండినందున ఎటు వెళ్ళినను అభివృద్ధి చెందుచు, గొప్ప ధనికుడాయెను? ఇది ఓర్వలేక ఆ దేశస్థులు : మా యొద్దనుండి వెళ్ళిపొమ్ము" అని అనిరి మరియు గెరారు కాపరులు ఇస్సాకుతో జగడమాడి (వచనము 20) ద్వేషము, వైరము చూపగా మరొక ప్రాంతమునకు వెళ్ళుమని దేవుడు ఇస్సాకుతో చెప్పెను. ఇక్కడ కూడను ఇస్సాకు ఐశ్వర్యమంతుడై, బహు గొప్పవాడాయెను. తిరిగి ఆ దేశపువారు మనస్సులో అసూయ, ద్వేషము కలిగి ఓర్వలేనితనము వలన ఇస్సాకుకు తొందర కలిగించిరి. ఇతడు ఒక స్థలము విడిచి మరొక స్థలమునకు దేవుని నడుపుదల

ప్రకారము వెళ్ళుచు, తుదకు బెయేర్షెబాకు చేరెను. ఇది అన్నిటికంటె ఎంతో మేలైన స్థలము. తమ దేశమందు ఇస్సాకునకు కలిగిన ఐశ్వర్యము విషయము ఫిలిష్తీయులు అతనితో కలహించిరి. అయినను ఇస్సాకు కలహము, వైరము, పగ కలిగియుండనందున దేవుడు అతనికి తోడైయుండెను. బెయేర్షెబా యను నిబంధనా స్థలమునకు ఇస్సాకు రాగా దేవుడు అతనితో నిట్లనెను. "నేను నీకు తోడైయున్నాను. గనుక భయపడకుము; నిన్ను ఆశీర్వదించె దను" (వచనము 24).

ఒకనికి దేవుడు ఆశీర్వదించినప్పుడు అతడు ఎదిరింపులను, ద్వేష మును ఎదుర్కొన బద్ధుడై యున్నాడు. మనుష్యులు అతని సంతోషమును పాడుచేసి అతని విశ్వాసమును తగ్గించి, అతని సమాధానమును చెడగొట్ట వలెనను ఉద్దేశముతో అతనిని ద్వేషము, కలహము, శత్రుత్వములోనికి లాగివేయజూతురు. దేవుని జనులను ద్వేషము కలహములలో దించి, ఎట్లయినను వారి విశ్వాసమును, సంతోష సమాధానములను తీసివేయ వలెనని సాతాను ఎన్నెన్నో విధముల ప్రయత్నించును. నీ స్థితి ఇట్లున్నదా? అట్లయితే దేవుడు సూచించుచున్న దిశకు దారిపట్టి సాగిపోవుచుండుము. విరోధము, కలహము, ఓర్వలేనితనము మొదలైన వాటికి పెడముఖము బెట్టుము. దేవుడు తుదకు నిన్ను బెయేర్షెబాకు తెచ్చి తీరును. నీవు ఇదివరలో కలిగియుండిన దానికంటె బహు అధికముగా నీకిచ్చును. యోహాను 16:20-22లో మన ప్రభువు ఇట్లు చెప్పుచున్నాడు : "మీ దుఃఖము సంతోషమగును. మీ సంతోషమును ఎవడును మీ యొద్దనుండి తీసివేయడు". నీ సంతోష సమాధానములను అపహరించుటకును, నీకు కోపము పుట్టించి నిన్ను విసిగించి నీ కోపము రేపి, నిన్ను కలహములోనికి లాగుటకు ఫిలిష్తీయులు ఎంతగా ప్రయత్నించినను జాగ్రత్తపడి ఇస్సాకువలె నుండుము. ఆ కలహము, ద్వేషము, ఓర్వలేనితనము భార్య ఎడలనో, భర్త ఎడలనో, సహోదరుడు లేక సహోదరి ఎడలనో, స్నేహితుడు, పొరుగువాడు లేక బోధకుని ఎడలనో,

ఎవరి ఎడలనైనను గాని అందులోనికి లాగబడుటకు సమ్మతించకుము. వాటిని విడిచి బెయేర్షెబా చేరువరకు పరిగెత్తి పారిపొమ్ము. అప్పుడు నీకిదివరకు కలిగియుండిన దానికంటె బహు అధికముగా నీకు దేవుడిచ్చును. ఇస్సాకు ఇచ్చుచున్న వర్తమానమిదే.

యాకోబు జన్మించుటకు పూర్వమే అతనిని ఒక రాజకుమారునిగా చేయవలెనని దేవుని సంకల్పమై యుండెను. అయితే స్వంత తల్లి విస్తార ప్రేమనుబట్టి ఆమె ఏమి చెప్పినను యాకోబు అట్లే చేయుచుండెను. ఇట్లు దేవునియొక్క వాగ్దానమును తప్పుడు విధముగా నెరవేర్చుకొన జూచెను. అందుచేత దేవుని ఎడలను, మానవుల ఎడల యాకోబు ఒక రాజకుమారు డగుటకు అనేక సంవత్సరములు పాట్లుపడవలసి వచ్చెను.

నేడు ఇండియాలోని అనేక క్రైస్తవులు భిక్షకులుగా నున్నారు. ఇండియాలోనే కాదు అమెరికా, ఐరోపాలలో కూడ నున్నారు. వారు భిక్షమెత్తు సంఘకాపరులు, భిక్షమెత్తు బోధకులు. క్రొత్త క్రైస్తవ ఆలయము కట్టుటకు, సువార్త పనికి, ఒక దండయాత్రకు మొదలగు ఇట్టి కార్యములకు డబ్బు అడుగుట న్యాయమేనని వారికి తోచుచున్నది. 'ధారాళముగా ఇవ్వండి. ధారాళముగా ఇవ్వండి! అని ఆస్ట్రేలియా, ఎక్కడో మిషనరీ పనికి డబ్బు కావలెను. ఆహారము లేక ప్రజలు మరణించుచున్నారు. చైనాకు లేక ఇంక ఏ దేశానికో వెళ్లువారెవరు?''' అని వేడుచున్నారు. ఇది జరిగిన వెనుక ఒకడు బయలుదేరి, "నేను ఇండియాకు వెళ్లుతాను, నాకు సహాయము చేయండి" అని చెప్పి, ఈ అభ్యర్థి "ఎవరైనా నాకు ఐదు డాలర్లు లేక కనీసం ఒక డాలరైనా ఇస్తారా?" అని ఒక స్థలమునుండి వేరొక స్థలమునకు తిరుగుచు భిక్షమడుగును. ఓ భిక్షకులారా! భిక్షకులారా! దేవుడు మిమ్మును ఇహలోక యువరాజులుగా కాక దేవునియొక్క యువరాజులనుగా చేయవలెననియు, తన అతిశ్రేష్ఠమైన దానిని మీకివ్వవలెననియు ఆయన కోరుచున్నాడు. మీకు అవసరమైన ప్రతిదానికొరకు మనుష్యుని యొద్దకు

కాక దేవుని యొద్దకు వెళ్లుటకు నేర్చుకొనుడి. ఈ రీతిగా చేయుటకు బదులు అనేకులు యాకోబు వలె తమ ఆలోచన ప్రకారము ఏర్పాట్లు చేసికొను చున్నారు. వారికి జ్యేష్ఠత్వము కావలెను. అయితే ఏశావును బ్రతిమాల నవసరము లేదు. మనము అడుగుదానికంటెను, తలంచుదాని కంటెను కూడ అత్యధికముగా దేవుడు ఇవ్వగలడు. అయ్యో! మనలో అనేకులము "యాకోబు" క్రైస్తవులము. పొట్టకొరకు క్రైస్తవులము. పేరాశ గల క్రైస్తవులము. దేవుడేమో ఇట్లు చెప్పుచున్నాడు : "ఇదిగో ఇశ్రాయేలూ, నీవు ఒక యువరాజువు, ఒక యాజకుడవు, నా స్నేహితుడవు, నాయొక్క జతపనివాడవు. నాయొద్దకు రమ్ము, నీకు నేను ప్రత్యుత్తరమిత్తును". దేవుడు యాకోబుయొక్క జీవితము ద్వారా మనము దేవునితోపాటు యువరాజులుగా, పాలిభాగస్థులుగా ఎట్లు కాగలమో మనకు నేర్పించగోరుచున్నాడు.

ఇశ్రాయేలీయులు ఐగుప్తుకు వచ్చి అక్కడ నాలుగు వందల ఏండ్లు నివసించిరి. వారిసంఖ్య విస్తరించి పోవుటవలన వారిమీద ఫరోకు ద్వేషము కలిగెను. తమ్ము విడిపించుమని వారు దేవునికి మొర పెట్టిరి. నాలుగు వందల ఏండ్ల వరకు వారు దాసత్వమందుండుటకు దేవుడు సమ్మతించెను. ఎప్పుడైతే మొర పెట్టిరో అప్పుడు వారిని రక్షించుటకు ఆయన మోషేను పంపెను. శత్రువుయొక్క నిర్దయ, క్రూరత్వము, దుష్టత్వము ఎంతమట్టుకు ఉండెనో వారు గ్రహించు పర్యంతము ఇశ్రాయేలీయులను దేవుడు దాసత్వ మందుండనిచ్చెను. వారు ఐగుప్తుకు వచ్చిన క్రొత్తలో బహు కుతూహలముగ నుండిరి. సమస్తము సమృద్ధిగా దొరుకుచుండెను. అయినను స్వదేశమునకు చాలాదూరమున నుండిరి. శత్రువుయొక్క భూమిలో నుండిరి.

మరణము, నరకము లేదని చెప్పువారు నేడు అనేకులు గలరు. వారు సాతానును సేవించెడు ఆధునిక బోధకులు. సాతానును సేవించుచు, దేవుని జనులను "పిల్లదంతా పూర్వకాలపు పద్ధతి" అనుచు హేళన చేయుట యందు ఆనందింతురు. తమ సరదాలు తీర్చుకొను నిమిత్తమే దేవుడు

లోకమును సృష్టించెనని చెప్పుకొనుచు, లౌకికులను అనుసరించుచు, సాతానును సేవించుచు, శరీరేచ్ఛలలో పడి కొట్టుకులాడుచుందురు. అనేకమంది క్రైస్తవులు, "మేము తిరిగి జన్మించితిమి" అని నోటితో చెప్పుదురే గాని లోకమాయలనేకములకు దాసులైయున్నారు. అపవాది ఎంతటి దుష్టుడో ఎరుగక అతనికి దాసులుగా నున్నారు. వీరు పాపమందును, అంధకార మందును నివసించుచున్న శరీర సంబంధులైన క్రైస్తవులు. ఫరో యొక్క హృదయ కఠినత్వమును గ్రహించు పర్యంతము నాలుగు వందల సంవత్సరములు ఇశ్రాయేలీయులు దాసత్వమందుండిరి. రాళ్లు మోయుచు, ఇతరమైన బరువైన మోతలు మోయుచు, తెల్లవారు జామునుండి చీకటి పడునంతవరకును పనిచేయుచు, చాలినంత జీతముకూడ లేకుండ ప్రయాసపడి ప్రాణములు విసిగి; "ఓ దేవా! మమ్ము తప్పించుము. మా బాధను కన్నీరును చూడుము" అని దేవునికి మొరలిడిరి. వారి మొర దేవుడాలకించి, రక్షించువానిని పంపెను. అయినను ఐగుప్తు నుండి వారికి విడుదల కలుగునంతలో ఆ దేశము మీదికి దేవుడు పది తెగుళ్లను పంపెను. ఏల? శత్రువు ఎంతగా మోసగించగలడో తన ప్రజలు గ్రహించునట్లు దేవుని బిడ్డలను అంధకారములోనికి లాగుటకు యత్నించుచున్న శత్రువు ఎంత యుక్తి గల దుష్టుడో ప్రతి దేవుని సేవకుడు నేర్చుకొనవలెను. సాతాను యొక్క అధిపత్యమును, ఆ అధిపత్యముయొక్క అంధకారమును మరచు దైవసేవకుడు తప్పక దాసత్వము పొందును.

ఇశ్రాయేలీయులు అరణ్యమందు నలువది ఏండ్లు తిరుగవలసి వచ్చెను. ఏ పని పాటు లేదు. ఒక పొలమైనను, ఒక కట్టడమైనను వారికుండ లేదు. వారి ఆహారము కొరకు "నేను అనుదినము మన్నా పంపుదును" అని దేవుడు చెప్పెను. వారు చేయవలసిన ఒకే కార్యము ఏమనగా దేవుని మేఘ స్తంభము కదలి ముందుకు సాగునంతవరకు వారు డేరాలు వేసికొనిన స్థలమందే యుండవలెను. (సంఖ్యా కాం. 9:18-22) కొన్నిసార్లు ఆ మేఘ

స్తంభము ఒకటి రెండు దినములు అట్లే నిలిచి యుండును. కొన్నిసార్లు అనేక మాసములు కూడ అట్లే నిలిచియుండును, ఆ స్తంభము ఉదయము లేక మధ్యాహ్నము లేదా నడి రాత్రి యందైనా ఎత్తబడవచ్చును. ఎప్పుడైతే ఆ మేఘము కదలునో అప్పుడు ఇశ్రాయేలీయులు ముందుకు సాగిపోవలెను. ఉదయమో, మధ్యాహ్నమో, రాత్రియో మేఘము వెళ్లుచున్న దిశలోనే వెళ్లవలెను గాని ఆ అరణ్యమందు తమకు నచ్చిన సమయమందు గాని, దిశను గాని పోవుటకు వీలులేదు. వారు దేవుని ప్రజలై యుండినందున ప్రతి విషయ మందును దేవునిచే నడుపబడి, ఆయన పాలనలో నుండి, ఆయన వశములో నుందవలెను. ఇదెంతో సులభమైన సంగతియైనను, ఈ పాఠము వారు నేర్చుకొనుటకు బహుకష్టమైనదిగా నుండెను. ఆత్మచేత నడిపింపబడుట (రోమా 8:14) అనెడు ఈ పాఠమును నీవు నేనుకూడా నేర్చుకొనవలెనని దేవుడు కోరుచున్నాడు. దేవుని ప్రజలకు పరిశుద్ధాత్మ వరము అనుగ్రహించ బడినది. ఆయనే రక్షకుడు; ఆయనే మార్గదర్శి, దేవుని బిడ్డ ఆయనకే లోబడి, ఆయన పాలనలో నుందవలెను. మన యిష్టమునకు మరణించితేగాని ఇది సాధ్యము. మరణించుటయును పాఠమును నేర్చుకొనుటకు ఎన్నో సంవత్స రములు పట్టును.

అనేకులు దేవుని పాలనలో కాదుగాని భార్య, భర్త, బిడ్డలు, పొరుగువారు, స్నేహితులు, లేక ఎవరో ఒక పురుషుడు, లేక ఒక స్త్రీ పాలనలో లేక నడిపింపులో నుంటున్నారు. ఎందరో పురుషులు కూటములో దేవుని స్వరమును విని ఇంటికి వెళ్లి భార్య సలహా అడుగగా, "తెలివి తక్కువ పనులు చేయవద్దు, ముగ్గురు బిడ్డలను, భార్యను ఏమి చేయబోతున్నావు? ఈ వ్యవహారాలు నీకు పనికిరావు" అని చెప్పును. ఎవరైతే వారిని పాపమందు దించుచున్నారో వారి వలననే కొందరు నడిపింపబడుచున్నారు. శరీరేచ్ఛలకు, ఆశ్యాశలకు, మాయా సంబంధములకు వశమై అవమానకరమైన జీవితములు జీవించుచు, "నేను దేవునికి లోబడితే స్నేహితులు, ఇంటిచుట్టుపట్ల ఉన్నవారు

ఏమనుకొంటారు? అని అనుచున్నారు. ఇట్టివారు సర్వ సంపూర్ణముగా దేవునికి వశపడుట ఎట్లు అను చిన్న పాఠమును నేర్చుకొనుటకు నలుబది యేండ్లు అరణ్యమందు సంచరించవలసి యుండినది ఆశ్చర్యమా?

అరణ్యము నుండి దేవుని ప్రజలు కానానుకు, వాగ్దాన ప్రదేశమునకు పాలు తేనెలు పారెడు దేశమునకు వచ్చిరి. దేవుడు తన ప్రజలకు చేయునట్టి ఏర్పాటునకు ఈ దేశమే ఒక సూచనయై యుండెను. యోహాను 6:55 నందు మనము చూచునది ఏమనగా ఈ దేశము అన్ని విషయములలోకూడ అసమానమై యుండెను. సారవంతమైన భూమి, ఏ భాగమందు చూచినను సమృద్ధి, సమస్తము వారికి సమృద్ధిగా నుండెను. దీనిద్వారా దేవుడు వారితో నిట్లనుచున్నాడు. "నా జనులారా, ఓ నా జనులారా, మీకొరకు నేను చేసిన ఏర్పాటు బహు సమృద్ధిగా నున్నది. మీరు దేవునినే భుజించుచు, ఆయననే విందుగా ఆరగించుచు, ఈ దేశముయొక్క రుచిని అనుభవింప నేర్చుకొనిన యెడల మీకు దేవుడే సమస్తమునకు చాలినవాడగును".

ఇశ్రాయేలీయులు ఆదేశ నివాసులతో ఎట్టివిధమైన నిబంధనను గాని, ప్రమాణమునుగాని చేసికొనరాదనియు, వారితో వివాహ సంబంధములు పెట్టుకొనకూడదనియు దేవుడు వారికి ఆజ్ఞాపించియుండెను. అయినను ఇశ్రాయేలీయులు దేవునికి అవిధేయులై ఆయన యెడల తప్పిపోయిరి. గిబియోను నుండి కొందరు పురుషులు పాతబట్టలు, పాత చెప్పులు తొడుగుకొని బూజుపట్టిపోయిన రొట్టెలను తెచ్చుకొని, "మిమ్మును గూర్చి విని చాల దూర దేశము నుండి వచ్చియున్నాము; మాతో నిబంధన చేసికొనుడు" అని చెప్పగా దేవుని చిత్తము అడిగి తెలిసికొనకయే వారితో యెహోషువ నిబంధన చేసికొనెను. దానివలన గిబియోను వారు ఇశ్రాయేలీయులకు ఒక ఉరిగా ఏర్పడిరి. ఇక క్రమేణ మిశ్రిత వివాహములు జరుగుట ప్రారంభించి విగ్రహారాధన మరియు ఇతర అసహ్యమైన కార్యములు సర్వసాధారణమైనవవిగా నాయెను. దేవుని జనులు ఆత్మీయముగా అంధులైరి.

దేవుని బిడ్డలు పరమ కానాను యొక్క భాగ్యము అనుభవింప కోరువారైతే ఈ లోకము నుండియు, దాని మార్గములు, దాని భోగముల నుండియు వేరుపడిన జీవితము అవశ్యము. ఎచ్చట చూచినను దేవుని జనుల మధ్య ఫలములు లేకపోవుటకు కారణమేమి? మంచి బోధలు వారికి దొరుకుచున్నవి గాని వారింకను అంధులుగానే, ఫలింపని వారుగానే యున్నారు. ఒక కారణమిది: లోకముతో నిబంధన ప్రమాణము చేసికొనుచున్నారు; కొందరు బట్టలు, ఫ్యాషనుల విషయము, కొందరు వివాహముల ద్వారా, కొందరు వృత్తి వ్యాపారముల ద్వారా నిబంధన చేసికొందురు. ప్రభువైన యేసుక్రీస్తునందు అక్కరలు సకలము తీర్చబడు ఏర్పాటున్న విషయము ఇట్టివారికి తెలియుట ఎట్లు? ఆయనే మన పరలోక ఆహారము, పానము, ధారాళముగా తృప్తిపరచువాడు. అయితే నీవు ఆయనకు నమ్మకస్తుడవై యుండవలెను. నిజమైన ఆత్మీయులైన భర్త గాని భార్య గాని దొరకనందున కొందరు చాలాకాలము వరకు అవివాహితుగా నుండవలసి వచ్చును. భోగములనుభవించుచు, ఆత్మీయముగ నిష్ఫలమైన జీవితము జీవించుట కంటే ఇదే ఎంతో మేలైనది.

నీ కుటుంబ జీవితమే గాని, ఆత్మీయ జీవితమే గాని సంఘ జీవితమే గాని ఏదైనను సరే, దేవుని వాక్యమును అనుసరించియే యుండవలెను. అట్లయితేనే సమృద్ధియైన జీవమును, సంపూర్ణ శాంతిని నీవు అనుభవించ గలవు. "గొఱ్ఱెలకు జీవము కలుగుటకును, అది సమృద్ధిగా కలుగుటకును నేను వచ్చితిని" (యోహాను 10:10) అప్పుడే చెప్పనశక్యమును మహిమా యుక్తమునైన సంతోషమును సమస్త శక్తిని, స్వరాజ్యమును ఆయన ఇవ్వగలడు. క్రీస్తే నా కానాను, నా సంతృప్తి, సమస్తమును సమృద్ధిగా నిచ్చువాడు. కొన్ని నదులున్నవి. విశాలమైన నదులు. వర్ష ఋతువు రాగా ఒక్క నెల మాత్రమే అందులో నీరుండును. లోతులేని, ప్రవాహము లేని నది, అనేక మంది క్రైస్తవులు ఇటువంటి నదులవలెనే యున్నారు. ఎల్లప్పుడును,

ఎల్లచోట్లను తన నిత్యశాంతి సంతోష శక్తులయొక్క సంపూర్ణతను క్రీస్తు ఇచ్చుటకు ఇష్టపడుచున్నాడు. ఇదే కానాను.

అటు తరువాత దేవుని మందిరము కట్టబడెను. దేవుడు దావీదును ఏర్పరచుకొని, అనేకయేండ్లు అతడు బాధనొందిన పిమ్మట అతనికి ఆ పరలోక నమూనాను ఇచ్చెను. (1 దినవృత్తా. 29:19). ఆ మందిరము ఎక్కడ నిర్మించవలెనో ఆ స్థలమునుకూడ దేవుడే దావీదుకు చూపెను. ఆ నమూనాను, తాను సేకరించిన సామానులను దావీదు సొలొమోనుకు ఇవ్వగా సొలొమోను ఆ అలయమును నిర్మించెను. సమాధాన పురుషుడు, దేవాలయము కట్టబడినది ప్రశాంతకాలము. మరియు నిర్మించు పనులు కూడను నిశ్శబ్దముగాను సమాధానముగాను జరిగెను. దేవుని నమూనా ప్రకారము ప్రతి చిన్న అంశము కూడ పూర్తియగు వరకు ఒక గొడ్డలి శబ్దమైనను, ఒక సుత్తె శబ్దమైనన్ను ఎవరికిని వినబడలేదు. పూర్తియైన పిమ్మట రాజును ప్రజలును బలులు అర్పణలు తెచ్చిరి. ఆకాశము నుండి అకస్మాత్తుగా అగ్ని దిగెను. మందిరమంతయు దేవుని తేజస్సుతో నిండెను. ఇదెంత విచిత్రమైన దృశ్యమై యుండవలెను? ఇశ్రాయేలు జనాంగమంతయు దేవుని శక్తిని చూచి హర్షించిరి. పరాక్రమవంతుడైన దేవుడు, సజీవుడైన దేవుడు వారిమధ్య నివసింపవచ్చెను. ఈ భాగ్యము తమదాయెనని వారందరు ఉత్సహించిరి. ఇదే కీర్తనల గ్రంథకర్త మాటలలో "నీ జనులకు కలుగు సంతోషము" అని యున్నది. విశ్వాసము ద్వారా అతడు ఆనందించెను; మనముకూడ విశ్వాసము ద్వారాను, అనుభవము ద్వారాను కూడ ఆనందించగలము.

మనతో ఒక ఆత్మీయ జనాంగమును ఏర్పరచవలెనని దేవుడు నిన్ను నన్ను ఏర్పరచుకొని యున్నాడు. దేవుని తేజస్సును చూచిన ఆ ఇశ్రాయేలు జనాంగము గర్వించి, అంధులై అంధకారమందు నివసించిరి. దేవుని నిజ ఆలయమైన సంఘములో ఇశ్రాయేలీయులు చూడజాలని దానిని ఆయన ప్రత్యక్షపరచుచున్నాడు. సొలొమోను దేవాలయము బహు చిత్రమైనది.

ఆయనను అది నాశనమొందవలసి యుండెను, అది నిత్యత్వమునకు నిలుచునది కాదు. ఇప్పుడైతే నీతోను నాతోను ఒక ఆలయమును నిర్మించుచున్నాడు. ఇది కదలక నిత్యత్వమునకు ఉండిపోవునట్టిది. ఇది రాతితోనో, బంగారుతోనో, వెండితోనో, ఇత్తడితోనో లేక కలపతోనో కట్టబడిన ఆలయము కాదు, యేసుక్రీస్తు ప్రభువే పునాదిగా కలిగిన సజీవ రాళ్లతో కట్టబడిన ఆలయమిది. ఈయనే మన పరమ సొలొమోను. పునాది అయనే, కట్టువాడు కూడ ఆయనే. నిరంతరము ఆయనయొక్క మహిమను ప్రత్యక్షపరచు నిమిత్తము నిన్ను నన్ను కూడ ఆలయ నిర్మాణముతో కలిపి ఆయన కట్టుచున్నాడు. ఇదే మనయొక్క ఆనందము, ఆయనయొక్క స్వాస్థ్యము. దేవుని యొక్క స్వాస్థ్యము ఆయన ప్రజలే; (ద్వితీ. కాం. 32:9; కీర్తనలు 78:71).

నేను కాలేజీలో చదువుచున్న కాలమందు ఇంగ్లండ్ యువరాజు (అయిదవ జార్జి గారి జ్యేష్ఠ కుమారుడు) ఇండియాకు వచ్చెను. అప్పుడు కాంగ్రెస్ వారు చేయుచుండిన సహకార నిరాకరణ ఉద్యమము తీవ్రముగా జరుగుచుండెను. లాహోర్‌లో ఈ సందర్భముగా ఎక్కడ ఏ పార్టీలు పెట్టినను మేము రామని చెప్పుచుంటిమి. మాలో ఒక్కడు మాత్రము పార్టీకి వెళ్లెను. అతడు తిరిగి వచ్చినపపడు అతనితో చేతులు కలుపబోతిమి గాని అతడు మా చేతిని ముట్టలేదు. ఏలయని అడుగగా అతడు; "నేను వేల్సు యువరాజుతో చేతులు కలిపితిని" అనెను. మహిమగల రాజుతో యుగయుగములు వాసము చేయుచు, ఆయన మహిమా సంపూర్ణతలతో నింపబడుట ఇంకెంత ఘన విచిత్రమో! ఈ నిరీక్షణ నన్ను పరమానందముతో నింపుచున్నది. ఆయన మనలను ఏర్పరచుకొని యుండుట ఇందు నిమిత్తమే. భూమిమీద ఏ గుంపుకో, సంస్థకో మనలను సభ్యులుగా చేర్చుటకు కాదు. పరలోకాలయము యొక్క సభ్యులుగా చేసి నిరంతరమునకు మనకు పరమానందమొసగుటకై మనలను ఏర్పరచుకొని యున్నాడు. నావంటివాడను సహా

పరలోక దేవాలయములో సభ్యుడనై దేవుని జనులతో కూడ సంతోషించుచు, దేవుని స్వాస్థ్యమైన వారితో కూడి కొనియాడుట నా ఆనందము, సంతోషము, నిరీక్షణయై యున్నది.

అడుగడుగునకు తన జనాంగమును దేవుడు ఎట్లు నడిపెనో గమనించుము. ముందు అబ్రాహామును, పిమ్మట ఇస్సాకును. అటు తరువాత యాకోబును వ్యక్తిగతముగా నడిపెను. అటు తరువాత తన జనులను ఐగుప్తునకు నడిపెను. అక్కడ నుండి అరణ్యము గుండా కానానుకు, ఆ తరువాత దేవాలయమును కట్టుటకును తన ప్రజల మధ్య పరలోక శక్తి భయముతో దేవునియొక్క తేజస్సు వచ్చి నివసించుటకును వారిని ఆ విధముగా నడిపించెను.

మీ రక్షకుడు మిమ్ము ప్రేమించుచున్నాడు గనుక ఆనందించుడి. భూలోక సమస్త జనాంగములకంటె గొప్పదైన పరలోక జనాంగముగా మిమ్ము చేయవలెనని యున్నాడు. ఆయన ఇప్పుడు నిన్ను నడుపనిమ్ము అప్పుడు దేవుడు నీకెంత సంతోషము నొసగునో నీవే గ్రహింతువు. పరలోక గీతములను నీవు పాడుచుండగా చెప్పశక్యము కాని ఆనందముతో నింప బడుదువు. సంగీతములో ఒక్క స్వరమైనను నాకు రాకున్నను సంగీతము, భక్తి కీర్తనలు నాకు ఆనందము కలిగించుట. నేను మారు మనస్సు పొందిన పిమ్మట నేను మొదటిగా భక్తికీర్తనలు వినినప్పుడు నేను పరలోకము నందుండినట్లే భావించితిని. ఆ సంగీతము పరలోక మాధుర్యము కలిగి యుండెను. పరలోక మందలి సంగీతము ఇంకెంత ఇంపుగా నుండునో!

దేవుని యొద్దకు రమ్ము : నీవు ఎవరైనను నీ జీవితము ఎంత అవమాన కరమైనదైనను ఆయన నిన్ను ఏర్పరచుకొననిమ్ము. నీ పాపములు ఎంత ఘోరముగా నుండినను, నిన్ను నీవు తగ్గించుకొని వాటిని ఒప్పుకొనుము. అప్పుడు దేవుని చేతిలో ఆయన వలన ఏర్పరచుకొనబడిన పాత్రవగుదువు

నీ హృదయ పూర్వకముగా ఇట్లు చెప్పుము; ప్రభువా నీయొద్దకు వచ్చుటకు యోగ్యుడను కాను. నేనింతగా చెడిపోయి మైలగా నున్నాను. అయితే ప్రేమగల నీ పిలుపును నీ స్వరమును వినగలుగుచున్నాను. ప్రభువా నీ స్వరమును నమ్ముచున్నాను. నన్ను అంగీకరించుము; నన్నుకూడా అంగీక రించుము. నీ రక్తముతో నన్ను కడిగి నీవలన ఏర్పరచుకొనబడిన పాత్రగా నన్నుచేసి నీ మహిమార్థమై నీ శక్తియొక్క సంపూర్ణతతో నింపుము ఆమేన్"

## 7వ అధ్యాయము

# నిత్యత్వమునకు ఏర్పరచుకొనెను

మనము ఇప్పుడు కీర్తనలు 106లో చివరి భాగమునకు వచ్చితిమి. 4, 5 వచనములు "యెహోవా నీవు ఏర్పరచుకొనిన వారి క్షేమము నేను చూచుచు, నీ జనులకు కలుగు సంతోషమును బట్టి నేను సంతోషించుచు నీ స్వాస్థ్యమైన వారితో కూడి కొనియాడునట్లు, నీ ప్రజలయందు నీకున్న దయ చొప్పున నన్ను జ్ఞాపకమునకు తెచ్చుకొనుము. నాకు దర్శనమిచ్చి నన్ను రక్షింపుము" ఈ మాటలను మన హృదయముల మీద లోతుగా చెక్కుకొని ఈ పఠనమును ముగింతుము. వాక్యములు ప్రతి యొక్కరి అనుభవముగా నుండవలెననియు హద్దులు గల మానవశక్తితో చెప్పబడిన విషయము పరిశుద్ధాత్మచేత మీకు విశదపరచబడవలెననియు మా ప్రార్థనయై యున్నది.

ఈ వాక్యములందు కీర్తనల గ్రంథకర్తయొక్క అత్యంత ఆశను చూచుచున్నాము. అతనితో కలిసి "నీ స్వాస్థ్యమైన వారితో కూడి కొనియాడు

నట్లు" అను ఈ వాక్యమందు నీవుకూడ పాలు పొందుము. ఒక ధనికుల కుటుంబమందు జన్మించిన శిశువు ఎట్లయితే ఆ ధనమునకు పాలి భాగస్తుడగునో, అట్లే ప్రభు యేసుక్రీస్తును స్వంత రక్షకునిగా మనము అంగీకరింపగా గొప్పదైన ఆ నిత్య స్వాస్థ్యములో పాలిభాగస్థులమగుదుము. ఆ శిశువునకు ఏ యోగ్యత లేకున్నను తండ్రి సొత్తునకు సర్వ హక్కు కలిగి యున్నాడు.

నాకు ధనికుడైన ఒక బంధువుండెను. అతడు చాలా ఆస్తి, డబ్బు విడిచి చనిపోయెను. భూములు మరియు ఇండ్లు అనేక స్థలములు అతడు కలిగియుండెను. వీటికి వారసులు అతని ఇరువురు కుమారులు. పెద్దవాడు చాలా తెలివిగలవాడు, చిన్నవాడు కేవలము తెలివి లేనివాడు. తండ్రి మరణా నంతరము వీరిరువురు ఆస్తిని పంచుకొనునప్పుడు పెద్దవాడు తమ్మునితో ఇట్లనెను : "ఇంటి బాడుగలు వసూలు చేయడానికి గాని, భూముల్ని చూసుకోవడము గాని నీకు చాలా శ్రమ. నీకు అంతవిద్య గాని, శక్తిగాని లేదు. నీకు బదులుగా వ్యవహరించే అధికారము (Power of attorney) నాకిమ్ము నేను నీవంతు పైకము ఇచ్చేస్తాను". "ఎంతిస్తావు" అని చిన్నవాడు అడిగెను. "అయిదువేల రూపాయలిస్తాను. అయితే నీవంతు నీకు అందినట్లు నీవు వ్రాసి యివ్వాలి". అప్పుడు తమ్ముడు ఇట్లు చెప్పెను : "నేను తెలివి తక్కువ వాడయినప్పటికిని ఆస్తిలో సగము భాగము నాదని తెలుసు. నీ సగము నీవు తీసుకో, నా సగము నాకిమ్ము. పద్దులు గిద్దులు నాకు చేతకాదు గాని నాకు సహాయంగా ఒక గుమస్తాను (accountant) పెట్టుకుంటాను. ఆ రిజిష్టర్లను నా చేతిలో పెట్టు. గుమస్తా మన భాగములెంతో చూచి చెప్పగలడు". అన్నగారి ప్రత్యుత్తరమేమనగా, "ఇదంతా మన కుటుంబానికి చెందిన విషయము, మన సంగతులు వాళ్లకి తెలియడమెందుకు? మనలో మనమే నెమ్మదిగా చూచుకొందాము.. పోనీ నీకు 5,000 రూ॥లు చాలకుంటె,

10,000 రూ॥లు ఇస్తాను. నీ జీవిత కాలానికంతా ఇది సరిపోతుంది. ఈపాటిదానికి అకౌంటెంట్లు, గికౌంటెంట్లు ఎందుకు?" తమ్ముడు మొండిపట్టు విడవకుండెను. "నావంతు ఒక వెయ్యి, మూడువేలు ఎంతైనగాని, సరిసగము నా హక్కు. న్యాయంగా నాకు రావలసింది నాకు వస్తేనేగాని నేను తృప్తి పడను. నీవు రిజిష్టర్లను తెచ్చిపెట్టు నేను గుమస్తాను పిలిపిస్తాను" అనెను. "పైవాళ్లకి మన సంగతులు తెలపడము ఎందుకు? నీకు పదిహేను వేలు ఇస్తానులే" అని అన్న మరల చెప్పెను. "ఏది ఏమైనను సరే, నీవు ఎంత ఇస్తాననినను, నావంతు సగము ఆస్తి నా చేతిలో పెట్టితేనేగాని నేను ఒప్పుకోను; దయతో పుస్తకములు తీసికొనిరా. అది నాలుగు లేక ఐదు వేలయినా ఫరవాలేదు" అన చిన్నవాడు అనెను. "ఇందులో పైవాళ్ల జోక్యం వద్దు. నీకు 25,000 రూ॥లు ఇస్తాను. అదే నీకు రావలసిన సగము వంతు"ఇట్లు పెద్దవాడు చెప్పెను. చిన్నవాడు పట్టువదలక వాదించుచునే లక్ష రూపాయలకు పైగా రాబట్టుకొనెను. ఏల? తండ్రి సగము ఆస్తి తనకు వ్రాసిపెట్టి యుండెనను గట్టి నమ్మకము అతనికుండెను. అతడు అమాయకుడు, తెలివితక్కువ, మందమతి గలవాడైనను తనవంతు యావత్తు తనకు రావలెనని పట్టుబట్టెను.

భూలోక ఆస్తియందు ఒకనికి హక్కు యున్నయెడల భాగము ఇచ్చి తీరవలెనని యడుగుటకు ఏమంత విద్య, జ్ఞానము అవసరము లేదు. అయితే మన పరలోక స్వాస్థ్యము యొక్క విలువను విశ్వాసులమైన మనము తెలిసికొనుటకు ఒకప్పుడు అనేక సంవత్సరములు పట్టును. లేఖనములు తేటతెల్లముగా చెప్పునదేమనగా ఎప్పుడైతే మన ప్రభువును స్వంత రక్షకునిగా మనము అంగీకరింతుమో ఆ క్షణమే దేవుని కుమారులగుటకు మనకు హక్కు, అధికారము ఇవ్వబడును. దేవునియొక్క నిరంతర ప్రేమను విశ్వాసము ద్వారా మనము పొందినందువలన మనము

నిత్యత్వమునకు ఆయన వారమై యున్నాము. యేసునాథుని స్వాస్థ్యమందు మనకు భాగమున్నది. సత్యము తెలిసికొనుటకు హెబ్రీ భాషగాని, గ్రీకు భాషగాని అవసరము లేదు. పరిశుద్ధాత్ముడే హృదయమందు నమ్మకము కలుగజేయుచున్నాడు. ఆ స్వాస్థ్యమును నీవు అనుభవించుట నీయొక్క విశ్వాసమునుబట్టి యున్నది. "మనము పిల్లలమైతే వారసులము, అనగా దేవుని వారసులము...... ...... ....... క్రీస్తు తోటి వారసులము" (రోమా 6:17, 18). ఈ రెండును జంటగానే యుండును. "నేను దేవుని బిడ్డను" అని నీవు చెప్పగలిగినచో, "నేను దేవుని వారసుడను, ప్రభువైన క్రీస్తు తోటివారసు డను" అనికూడ చెప్పగలవు.

ఈ స్వాస్థ్య మెట్టిదో ప్రస్తుతము పూర్తిగా గ్రహింపజాలము. అయితే సమస్తమును మనము తెలిసికొను దినము వచ్చుచున్నది. ఒక ధనికుని చిన్న కుమారుడు అతని తండ్రి ఆస్తిపరుడని ఎరుగును. అయితే "మీ తండ్రికి ఏపాటి భూములున్నవి. ఎంత డబ్బున్నది?"యని అడిగినచో "నాకు తెలి యదు" అని ఆ చిన్న బాలుడు జవాబిచ్చును. ఇంత లేతవయస్సునందు ఎరుగడు గాని పెద్దవాడైన పిమ్మట తండ్రి ఏమేమి, ఎంతెంత కలిగియున్నాడో సకలము గ్రహించగలడు. ఇట్లే మన స్వాస్థ్యము ఎంత గొప్పదో మనము ఇప్పుడు గ్రహింపకున్నను ముఖాముఖిగా మన ప్రభువును చూచిననాడు, కృపాకార్యము సంపూర్ణమైననాడు సమస్తము తెలిసికొందుము.

నిరంతరమునకు శాశ్వతమైన ఒక గొప్ప స్వాస్థ్యమును పొందు నిమిత్తము నీవు పిలువబడి ఏర్పరచు కొనబడితివని నీవు నమ్మవలెను. యేసుక్రీస్తును రక్షకునిగాను, ప్రభువుగాను మనము అంగీకరించుటవలన సంపూర్ణ ఆత్మీయ పాలివారమగుదుము. మున్ముందుగా దైవ స్వభావమందు పాలివారము (2 పేతురు 1:4), రెండవదిగా, పరిశుద్ధాత్మయందు పాలివారము

(హెబ్రీ 6:4), మూడవదిగా, పరలోక పిలుపునందు పాలివారము (హెబ్రీ 3:1). నాలుగవదిగా, దేవుని పరిశుద్ధతయందు పాలివారము హెబ్రీ 12:12) అయిదవదిగా ప్రత్యక్షము కానున్న మహిమయందు పాలివారము (1 పేతురు 5:11), ఆరవదిగా తేజోవాసులయిన పరిశుద్ధుల స్వాస్థ్యమందు పాలివారము (కొలొస్సై. 1:12), ఏడవదిగా, క్రీస్తులో పాలివారము (కొలొస్సై. 1:12), ఏడవదిగా క్రీస్తులో పాలివారము (హెబ్రీ. 3:14).

దేవునియొక్క పరలోక స్వాస్థ్యమందు పాలివారమగుట ఎంత భాగ్యము! ఇట్టి అక్షయమైన, వాడబారని, తేజోవంతమైన స్వాస్థ్యమందు ప్రవేశపెట్టుటకై, దానిని మనము అనుభవించవలెనని మన ప్రేమగల దేవుడు మనలను ఏర్పరచుకొని యున్నాడు. ఈ స్వాస్థ్యమందు నీకొక భాగమున్నదని నీవు నమ్మవలెను. రక్షణ అనగా మోక్షానికి వెళ్లుట అనునదే అని అనేకమంది విశ్వాసుల యొక్క తలంపు. కరుణానిధి యగు దేవుడు పాపములను క్షమించగా పరలోకమునకు వెళ్లగలరని తలంచుచు, మోక్షములో చేర్చబడిన అంతేచాలు. ఒక చిన్న మూల తాము అక్కడ ఉండుటకు దొరికినను ఫరవాలేదు అనుకొనుచున్నారు. ఇది హౌరా ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణము చేసినట్లున్నది. ఈ రైలుబండి క్రిక్కిరిసి యుండును. నిలుచుటకైనను స్థల ముండదు. నీవు ప్లాట్‌ఫారము చేరగానే బండి ఈలవేసెను. ఆ బండి నీకు తప్పిపోకూడదు. ఎట్లయినను దానిలో నీవు ఎక్కవలెను. ఏ విధముగానో, కూలీలు సహాయము చేయగా ఎక్కి ఒక మూలలో నిలబడి నీ మనస్సులో ఏమనుకొనుచున్నావంటే, "ఏదో ఒక మూల దొరికిందిలే, బండిలో ఉన్నాను అంతేచాలు". నీ యుద్దేశము పరలోకము ఇట్లే క్రిక్కిరిసి యున్నదనియు అచ్చట ఏమూల నీకు దొరికినను అంతే చాలుననియా? "అబ్బా మేము బోధకులలాగ, సాధువులాగ, సన్యాసులలాగ ఉండలేము. భూమిమీద ఉండక తప్పదు; డబ్బు గడించాలి.

లోకస్థుల మధ్య జీవించాలి. అంతా విడిచి పెట్టడము ఏలేనా? అని నీవనవచ్చును. శత్రువు ఈవిధముగా నిన్ను వంచించి పరలోక స్వాస్థ్యమందు భాగమును నీవు పోగొట్టుకొనునట్లు చేయును. నీయొక్క హక్కుగా ఆ స్వాస్థ్యమును నీవు అడుగవలెను. జయ జీవితము జీవించి, దానిని అనుభవించవలెను. ప్రభువు తానే ప్రకటన 21:7లో ఇట్లనుచున్నాడు; జయించువాడు వీటిని స్వతంత్రించుకొనును. నేనతనికి దేవుడనై యుందును. అతడు నాకు కుమారుడై యుండును".

ఒక చిన్న బాలుడు తన తండ్రి చేతినో లేక తల్లి చేతినో పట్టుకొని యున్నాడనుకొనుము. ఆ పురుషుడు లేక స్త్రీ ఎవరని నీవు అడిగినచో "మా నాన్న" లేక "మా అమ్మ" అనును. తన స్వాస్థ్యమును ఆ బిడ్డ ఎరుగును. నూతన సృష్టిలోని సమస్తమును నీవు స్వాస్థ్యముగా పొందినను ప్రభువు మీద నీకున్న హక్కుకంటె అధికముగా వాటిమీద నీకు లేదు. "ఆయన నా ప్రభువు, నా దేవుడు; నా ఇష్టము వచ్చినప్పుడు నా యిష్టమున్నచోట నేను ఆయన యొద్దకు వెళ్లగలను" అని నీవు చెప్పగలిగి యుండవలెను. ఈ రీతిగా పరలో:ము ఎట్లుండునో దాని తొలి రుచి ఈ భూమిమీదనే మనకు ఇవ్వబడి యున్నది.

ఈ నూతన జీవిత ప్రారంభమందు ప్రార్థనకు మోకరించినప్పుడు నీ ప్రార్థనలో భూసంబంధమైన విషయములే వచ్చును. ఒకానొక ఓడమీద ప్రయాణము చేయుచుండిన ఒక చిన్న బాలిక, తన బొమ్మను ఎత్తుకొని, ఓడ నాయకుని దగ్గరకు పోయి ఆడుకొనుచుండెను. ఒక దినము ఆ బొమ్మ సముద్రములో పడిపోయెను. ఓడను ఆపుచేయమని ఆ ఓడ నాయకుని బాలిక అడిగెను. ఏలయని అతడు అడుగగా, "నా బొమ్మ సముద్రములో పడిపోయింది. దాన్ని తీసి నాకివ్వండి" అనెను. "ఒక చిన్న బొమ్మ సముద్రములో

పడిపోయిందని ఇంత పెద్ద ఓడను నేను అపుచేయడము ఎలాగు? ఒక మనిషి పడిపోతే, ఓడను ఆపవచ్చును గాని ఒక చిన్న బొమ్మ కోసం ఆపడానికి వీలులేదు" అని అతడు ప్రత్యుత్తరమిచ్చెను. "నీవు మంచివాడవు కావు, చాల చెడ్డవాడవు" అనుచు ఆ బాలిక ఓడ నాయకుని దగ్గరనుండి వెళ్లిపోయెను. యుక్తకాలమున ఓడ ఒక రేవు చేరెను. ఆ బిడ్డ తల్లిదండ్రులు ఒక హోటలుకు వెళ్లిరి. ఓడ నాయకుడు అదే హోటలుకు వెళ్లెను. ఆ బిడ్డ అక్కడ కనబడగా; అతడు ఒక షాపుకు వెళ్లి, ఒక చక్కని బొమ్మను కొని హోటలుకు తెచ్చి ఒక బల్లమీద ఆ బొమ్మను ఉంచి, "రామ్మా పాపా, నీకేమి తెచ్చానో వచ్చి చూడు" అని ఆ బాలికను పిలిచెను. ఆ బిడ్డ ముఖము త్రిప్పుకొని, "నీవు చాలా చెడ్డవాడవు" అనెను. ఓడ నాయకుడు నెమ్మదిగా బొమ్మ ఉండబడిన పెట్టెను విప్పి మూతను పైకెత్తి ఆ బొమ్మను చూపెను. దానిని చూచి ఆ బిడ్డ "ఇది నాకేనా? నాకేనా?" యని ఉల్లాసముగా కేకవేసి, "నీవు చాలా మంచివాడవు" అనుచు అతనిని గట్టిగా కౌగిలించి, వందనములు చెప్పెను.

మన విషయముకూడ ఇంతే. భూ సంబంధమైనవే దేవుని దగ్గర అడుగుచున్నాము. అయన మనమడిగినది ఇచ్చిన ఎడల, "దేవుడు చాలా మంచివాడు" అందుము. ప్రతి కూటమునకు వెళ్లుదుము. ఈ కార్యము ఆ కార్యము, ఎన్నో కార్యములలో మనముకూడ పాలు పొందుదుము. అయితే కష్టములు, దుఃఖములు, పరీక్షలు రాగా లేక కుటుంబమునందు ఎవరో మరణించగా అప్పుడు ఈలాగు మాట్లాడుదుము; "దేవుడేమయినాడు? ఎక్కడున్నాడు? నేనింక ఏ కూటములకు వెళ్లను. ఇంకొక పైసా ఆయనకివ్వను. చూడు, ఏమిచేశాడో : మంచి కార్యాలు ఎన్నెన్ని చేశాను. ఇన్ని కష్టదుఃఖాలు నామీద రానియ్యవచ్చా? నా చేయి విడిచిపెట్టేశాడు. నన్ను మరచే పోయాడు". అది నిజమేనా? నీవు ఆయన బిడ్డవు. నీ మార్గములకంటె ఆయన మార్గములు ఎంతో ఉన్నతమైనవి. తేజోవంతమైన ఒక పరలోక

స్వాస్థ్యమునకు నిన్ను పిలిచియున్నాడు. నీకున్నట్టి జయించు శక్తిని బట్టియె దానిని నీవు అనుభవించగలవు. రోమా 8:8లో ఇట్లు వ్రాయబడి యున్నది : "మన యెడల ప్రత్యక్షము కాబోవు మహిమ యెదుట ఇప్పటికాలపు శ్రమలు ఎన్నతగినవి కావు" తన తేజోవంతమైన రాజ్యమునకు మనలను దేవుడు పిలిచి యున్నాడని హృదయపూర్వకముగా మనము నమ్మవలెను (1 థెస్స 2:12) నన్ను తన తేజోవంతమైన రాజ్యమునకు దేవుడు పిలిచి యున్నాడని నేను నమ్ముచున్నాను. ఈ సత్యమును మనము నమ్మిన యెడల ఆయన పిలుపునకు పాత్రులుగా మనము బ్రతుకుదుము.

నాకు ఐదుగురు సహోదరులు గలరు. నా తరువాత వాడు కొన్ని సంవత్సరములకు పూర్వము ఒక పెద్ద ఉద్యోగి అయెను. ఒక దినము మేమిద్దరము కలిసి ప్రయాణము చేయుచుండగా "నేనింక (థర్డ్ క్లాసు) మూడవ తరగతిలో ప్రయాణము చేయుట మానుకొంటాను" అని అతడనెను. "ఇన్నాళ్లు ఏ (క్లాసులో) తరగతిలో ప్రయాణము చేసేవాడవు? (థర్డ్ క్లాసు) మూడవ తరగతిలో కదా?" అని నేను అడిగితిని. ఇప్పుడు నేను మేజిస్ట్రేటుగా ఉన్నాను. నా పదవికి అది లోకువ కాదా? అప్పో సొప్పో చేసి నా ఉద్యోగానికి తగినట్టుగా (ఫస్టు క్లాసు) మొదటి తరగతిలోనే నేను వెళ్లాలి" అని అతడు ప్రత్యుత్తర మిచ్చెను. ఒక గొప్ప సత్యమును బోధపరచుటకు ఉపయోగించిన ఈ దృష్టాంతము ఏమంత సరియైనది కాదు. దేవుడు తన రాజ్యమునకును, తన మహిమకును నిన్ను పిలిచి యున్నాడని నమ్మినచో నీవు ఆ పిలుపుకు తగినట్టి జీవితము జీవింపచూతువు. నీవు దేవుని బిడ్డవు, ఆయన పాలివాడవు, పాత్రవు, ఒక రాజువు, ప్రధానుడవు, యాజకుడవు. కావున ఆయనకు తగినట్లుగా నడువుము.

ఆ తేజోవంతమైన పరలోక పిలుపునకు మనము అనేకమైన పరీక్షలు, శోధనలు, శ్రమలు, కష్టముల ద్వారా సిద్ధపరచబడవలెను. ప్రభువా ఈ

రీతిగ, ఈ రీతిగా మమ్ము తర్ఫీదు చేయుము అని ఆయనకు సలహా నిచ్చుటకు మనకు హక్కు లేదు. ఒక కాలేజీ లేక విశ్వవిద్యాలయములో చేరినప్పుడు ప్రొఫెసరు గారి దగ్గరకు పోయి : "ప్రొఫెసరు గారు, నేను కళాశాలలో యోగ్యతా పత్రమును పొందినవాడను, మంచి భాగ్యవంతుల కుటుంబానికి చెందినవాడను. మీరు నాకు విద్య ఏవిధముగా నేర్పవలెనో నేను మీకు చెప్పగలను" అని చెప్పకూడదు. ఇట్లు చెప్పుటకు నీకు హక్కులేదు. నీకు ఏది ఉత్తమమో అతనికి తెలియును. గనుక అతడు నీకు బోధించునది నీవు నేర్చుకొనవలెను. మనకు ఏది ఉత్తమమో దేవునికి మాత్రమే తెలియును. మనలను ఎట్లు తర్ఫీదు చేయవలెనో ఆయనకు మాత్రమే తెలియును. ఆయన శిక్షించినను, గద్దించినను, పరీక్షించినను ఏదో ఒక సంకల్పము కొరకే చేయును.

స్వాస్థ్యమును గూర్చి చెప్పవలసినది మరొకటి లేదు. ఏ స్వాస్థ్యమైన తల్లిదండ్రుల నుండియే మనకు వచ్చును. ఉదాహరణముగా నేను మాతండ్రి గుణ లక్షణములను, స్వభావమును కలిగి యుంటిని, మా నాయన మా తాత, మా కుటుంబము వారి మధ్య నన్ను చూచితివంటె "కుటుంబ పోలిక నీకు చాలా ఉన్నది" అందువు. మా తండ్రికి చేతిని ఎత్తి పెట్టుకొనుట ఒక అలవాటు. అదే అలవాటు నాకు కూడ వచ్చెను. మా తండ్రిని నన్నుకూడ ఎరిగినవారు, "నీవు అంతా మీ తండ్రి లాగే ఉన్నావు" అందురు.

కొందరు యువకులు బహు తెలివితేటలు గలవారు. మనమిట్లు చెప్పుకొనవచ్చును. "వీడు పంజాబి వాడు అయివుండడు. ఇంత తెలివి పంజాబి వాళ్లకి ఎక్కడిది? ఆంధ్రుడేమో!" "అబ్బే, ఆంధ్రులకైనా ఇంత కుశాగ్రబుద్ధి ఉండదు. బెంగాలీవాడు కాబోలు" "లేదు, లేదు, బెంగాలీ వాళ్లకి కూడా ఇంత తెలివితేటలు ఉండవు". మన తల్లిదండ్రుల వలన మనము పొందు గుణలక్షణములలో వారి దేశ, జాతి చిహ్నములు కూడ

నుండును. ఇట్లి దేవుని బిడ్డలమైన యెడల మన పరలోకపు తండ్రి యొక్క గుణములు, మన పరలోక జాతి చిహ్నములు మనలో ప్రత్యక్షము కావలెను. పాపులమై యుండినంత కాలమును పాపముతో, అవమానముతో, మైలతో నిండియుంటిమి. మారు మనస్సు పొందిన పిమ్మట దైవ సుగుణములు కొన్ని మనలో ప్రత్యక్షమగుచున్నవి. ఇవి మన ప్రభువైన యేసుక్రీస్తు నుండియే వచ్చినవిగాని కుటుంబమునుండి, జాతినుండి దేశమునుండి వచ్చిన గుణములు కావు. ఆయనయొక్క గుణ స్వభావములు మనకు ఇవ్వబడు చున్నది. దయ, మృదుత్వము, ప్రేమ, దీర్ఘ శాంతము, ఓర్పు, సహింపు ఇట్టివి, ఇవి పరలోకమునుండి పొందిన గుణ లక్షణములే గాని తల్లిదండ్రుల వలన, గురువులు, బోధకులు ప్రొఫెసరుల వలన కాదుగాని, మనలో నున్న దేవుని జీవమునుండి కలిగినవి అయినప్పటికిని ఈ సుగుణములు మన జీవితమునుండి కలిగినవి అయినప్పటికిని ఈ సుగుణములు మన జీవితము లందు ప్రత్యక్షపరచబడుటకు మనము ఇష్టపడవలెను.

రాజకుటుంబమందు ఒక శిశువు జన్మించిన యెడల పుట్టుకతోనే అతడు ఒక రాజకుమారుడు. ఇది ప్రతివారికి తెలిసిన విషయమే. బహుశః ఆ బిడ్డ చాల నల్లగాను దళసరి పెదవులు, పొడవు చెవులు, బోడితల కలిగి యుండవచ్చును. అయినప్పటికిని అతడు రాజకుమారుడే. మనము దేవుని బిడ్డలైనచో, రాజులము, యాజకులము అయితిమి. ఇది మన అధిక్యత (ప్రకటన 1:6). ఈ మాటలు అపొస్తలులు, ప్రవక్తలు, హతసాక్షులకే చెందుచున్నవని తలంచవద్దు. అవి ప్రతివారికి చెందుచున్నవి అనగా మన ప్రభువగు యేసుక్రీస్తు రక్తముతో కడుగబడి, శుద్ధీకరించబడి; పరిశుభ్రపరచబడి పరలోక కుటుంబమందు జన్మించి, దేవునికి రాజులుగాను, యాజకులుగాను చేయబడినవారికి, ఆంగ్లేయుల కాలమున ఇండియాలో రాజకుటుంబముల వారికి, ఒక ప్రత్యేక కళాశాల యుండెను. ఇచ్చట యువరాజులకు చదువుట,

వ్రాయుట మాత్రమే గాక పరిపాలనచేయు విధము, మరియు రాజులు ప్రవర్తింపవలసిన రీతిని ఇవన్నియు నేర్పుచు, తర్ఫీదు చేయుచుండిరి. ఇట్లే మన జీవితమనెడు దేవుని కళాశాలయందు మనమెట్లు ఈ జీవిత కాలమందు పరిపాలన చేయవలెనో, పరలోక సార్వభౌముని కుమారులుగా ఎట్లు ప్రవర్తించవలెనో మనకు నేర్పబడుచున్నది.

ఈ దినములలో ఏ కళాశాలయందైనను ఒక సీటుకొరకు ఎన్నో తిప్పలు పడవలెను. విద్యార్థులు ఆ సీటుకొరకు ఈ కాలేజినుండి ఆ కాలేజికి మరియు ఊరూరు తిరుగుచుందురు. దేవుని తర్ఫీదు ఇట్లుండదు. దావీదును ఒక దృష్టాంతముగా తీసికొందము. శత్రువులను తప్పించుకొని పారిపోయి అదుల్లాము అనబడిన చీకటి గుహలో దాగియుండెను. అతడు రాజుగా అభిషేకించబడినవాడు. ఎందులో చూచినను సమర్థత గలిగినవాడు మరియు దేవుని హృదయానుసారుడు. ఇట్టి దావీదు తనను దేవుడు చేయి విడిచెనని తలంచియుండవచ్చును. అరణ్యములలో, గుహలలో, ఎడారులలో దావీదును దేవుడు ఏల సంచరించనిచ్చెను? ఎనిమిది ఏండ్ల దీర్ఘకాలము ఇతనిని సౌలు వెంటాడుటకు ఏల సమ్మతించెను? ఈ తిప్పలే దావీదును దేవుడు సిద్ధపరచు విశ్వవిద్యాలయమును, తర్ఫీదు నిచ్చు కళాశాలయు కూడ నాయెను. ఇచ్చటనే అనేక దైవసత్యములను దావీదు నేర్చుకొనెను. ఇచ్చటనే అనేక క్రొత్త పాటలు కట్టెను. ఇచ్చటనే అతని జతపనివారిగా పరాక్రమవంతులైన పురుషులను దేవుడు దావీదుకు ఇచ్చెను. ఈ పరీక్షల న్నిటిలోను దావీదు కృతార్థుడైన పిదప ఒకనాడు దేవుడే అతనికి ప్రత్యక్షమై ఒక పరలోక నమూనాను ఇచ్చెను. అనగా దేవాలయము యొక్క మాదిరిని. 1దిన వృ. 28 : 19లో ఇట్లు చెప్పబడియున్నది. "యెహోవా బలము నామీదికి వచ్చి ఈ మచ్చుల పనియంతయు వ్రాతమూలకముగా నాకు చెప్పెను". యెహోవా బలము దావీదు మీదికి వచ్చి, ఆ పరలోక నమూనాను అతడు

గైకొనిన దినమే, దావీదు యొక్క జీవితకాలమంతటిలో అతనికి మిక్కిలి సంతోషకరమైన దినమని నా నమ్మకము. ఈ ఘనతను ప్రారంభమందే దేవుడు దావీదుకు ఇచ్చియుండలేదు. అతనికి సంభవించిన శ్రమలన్నిటి ద్వారా దావీదు ముందుగా తర్ఫీదు కావలసి యుండెను. ఒకవేళ ఇదే దైవిక పద్ధతిని ఉపయోగించి దేవుడు నిన్ను తర్ఫీదు చేసి సిద్ధపరచుచున్నాడేమో! దేవుని పరలోక ఏర్పాటును నీవు స్పష్టముగా చూచుదిన మొకటి నీ జీవితకాలమందు వచ్చును.

మరియు వారసత్వమునుబట్టి ముందుకు నీకేదో ఏర్పరచబడి యున్నది. దేవుని రాజకుటుంబమందు నీవు జన్మించితే ఆయన రాజ్యమందు నీవు సర్వదా ఏలునట్టి దినమొకటి వచ్చుచున్నదనియు, అందు నిమిత్తము ఇప్పుడు సిద్ధపరచబడుచున్నావనియు నీవు ఎరుగుదువు. విక్టోరియా రాణి చిన్న బాలికగా నున్నప్పుడు, ఒక దినమున తాను రాణియగునని ఎరిగి యుండలేదు. బొమ్మలతో ఆడుకొనుట ఆమెకెంతో ఇష్టము. తాను రాణియగునను విషయము ఆమెకు ఎవరును తెలుపకూడదని ఆ కుటుంబ మందు అందరికి ఆజ్ఞ ఇవ్వబడెను. ఆమెకు విద్య నేర్పుచుండిన గురువు ఒకనాడు పాఠమునందు రాజకుటుంబ వంశావళిని బోధించుచుండగా రాజ్యమేలుచుండిన తన పెదతండ్రియొక్క సింహాసనమునకు తానే వారసు రాలని గ్రహించెను. రాజభవనమందు ప్రతివారిని, "నిజమేనా? నిజమేనా? నేను ఇంగ్లండు రాణిని అవుతానట, నిజమేనా?" అని అడిగెను. ఆ దినమునుండి బొమ్మలతో ఆడుకొనుట మానివేసెను. ఆమె స్వభావము గంభీరమాయెను. "అంత పెద్ద రాజ్యము నేను ఏలవలసి ఉన్నది గనుక నేను చాలా గంభీరముగనే ఉండవలెను" యనెను. రాజ్యమేలుటకు మనము కూడ నేర్చుకొనవలసి యున్నది. వారసత్వమునుబట్టి దేవుని అధికారమంతయు మనకు ఇవ్వబడి యున్నది. అయితే దానిని ఎట్లు

ఉపయోగించవలెనో నేర్చుకొనుట అవశ్యము. ఇందు నిమిత్తము తర్ఫీదు పొందుచున్నాము. నీకు వారసత్వముగా ఒక గొప్ప అస్తి వచ్చిన యెడల దానిని పాలించుట ఎట్లో నీవు నేర్చుకొనవలెను. ఇండియాలో కొందరు రాజులు బలమైన కట్టడములలో తమ ధనమును ఉంచుదురు. అదే వారికి తృప్తి. "నాకు ఇంత ధనమున్నది, వజ్రములు, రత్నములు, వెండి" అని అందురు. ఆ ధనము అక్కడ పడియుండవలసినదే; చూచి సంతోషించుటకే. పరసంబంధమైన ధనమైతే ఉపయోగపరచబడవలెను. దానిని ఎట్లు ఉపయోగ పరచవలెనో నేర్చుకొనుటకే మనము తర్ఫీదు పొందుచున్నాము. కొన్ని వృత్తులు విషయమైన జ్ఞానము వంశపారంపర్యముగా వచ్చుచున్నది. బాల్యము నుండి ఏదో వృత్తి నీవు నేర్చుకొనిన ఎడల తక్కువ వయస్సులోనే ఒక వడ్రంగి లేక కంసాలి యగుదువు. ఒక స్వర్ణకారుని కుటుంబమున జన్మించినవారు బహు త్వరితముగా ఆ వృత్తిని నేర్చుకొందురు. కాని ఇతరులకు దీర్ఘకాలము పట్టును. అట్లే నీవు క్రొత్తగా జన్మించినది మొదలుకొని దేవుని జ్ఞానములో పాలుపొందుచు, ప్రభువైన యేసుక్రీస్తుకు జతపనివాడవు అగుచున్నావు.

కడపటిదిగా, మనము దేవునికే స్వాస్థ్యముగా ఏర్పరచుకొనబడి యున్నాము. తల్లిదండ్రులు బిడ్డలకు తమ ఆస్తిని పంచిపెట్టినప్పుడు ఎవరి వంతు వారు పొందుదురు. అయితే బిడ్డలు తమకు ఏమైనను ఇచ్చిన ఎడల జననీ జనకులు ఎంతో ఆనందింతురు. తమ ప్రేమను బిడ్డలకు ఇచ్చుటకు తల్లిదండ్రులు ఎంతగానో కోరుదురు. మన పరలోక తండ్రి శాశ్వతమైన ప్రేమతో మనలను ప్రేమించుచున్నాడు. మన పరలోక స్వాస్థ్యము ఈ ప్రేమయే, పరలోక తండ్రియు, మిత్రుడును, పెండ్లి కుమారుడైన దేవుని ప్రేమను సంపూర్ణముగా అనుభవింతము రండి అయితే, మన ప్రేమను తాననుభవంవించవలెనని కూడ ఆయన కోరుచున్నాడు. మనము ఆయనను ఎంతమట్టుకు ప్రేమించుచున్నాము? అయ్యో, ఎన్నో మారులు మన పరలోక

స్వాస్థ్యమును గూర్చియు, మన పరలోక తండ్రిని గూర్చియు ఎంతగా సిగ్గుపడుచున్నాము?

నేను మా పాఠశాలయొద్ద హాస్టలులో ఉన్నప్పుడు నన్ను చూచుటకు మా నాయన ఒకసారి వచ్చిరి. ఆయనదంతా పురాతనపు తీరు. చాలా పెద్ద తలపాగ, పొడవు పాటిపంచె, పల్లెటూరి చెప్పులు ధరించి నన్ను చూడవచ్చి; నాకు నెయ్యి, పిండివంటలు, డబ్బు తెచ్చిరి. నా స్నేహితుడొకడు ఆయనను చూచి నన్ను పిలిచి "అతడెవరు?" అని అడిగెను. "మా ఊరినుండి వచ్చిన ఒక ముసలాయన" అని నేనంటిని. ఇది మీకు నవ్వుగా నుండవచ్చును. అయితే, సత్యము, మా నాయన తెచ్చియిచ్చిన డబ్బు, సమస్తము తీసికొంటిని. ఆయనను మా తండ్రియని చెప్పుటకు సిగ్గుపడితిని. ఆయన, నాకొక మంచి ఇంగ్లీషు సూటును కూడా తెచ్చిరి. అయినను యౌవన గర్విష్ఠుడనైన నేను, నా తండ్రి ఎవరో అన్నట్లు ప్రవర్తించితిని?

యేసుక్రీస్తు ప్రభువును తమ స్వంత రక్షకుడని ఒప్పుకొనుటకు సిగ్గుపడునట్టి విశ్వాసులు అనేకులున్నారు. అయ్యో! స్నేహితుల మధ్య పొరుగువారి మధ్య తిరుగునప్పుడు ఆయనను గూర్చి సిగ్గుపడుచున్నారు. కష్టములు వచ్చిపడినప్పుడు "ప్రభువా, సహాయము చేయుము, నాకు సహాయము చేయుము. నీ సహాయము నాకు కావాలి". యని మొరబెట్టుదురు. ప్రభువు సహాయము చేయుటకు సిద్ధమే. అయితే సహాయము చేసినంత మాత్రమున ఆయన హృదయము తృప్తిపడుట లేదు. ఆయనతో మనము పరిపూర్ణముగా ఐక్యపడువరకును, సంపూర్ణముగా ఆయన మనస్సులను స్వంతము చేసికొనువరకును, పెండ్లి కుమారునికి పెండ్లికుమార్తె ఎట్లో అట్లే ఆయనకు మనము అగు పర్యంతమును తృప్తిపడడు. దేవుడు తేజోవంతమైన ఆ స్వాస్థ్యము కొరకు మనకు విస్తారముగా ఆకలిని పుట్టించి, ఆ స్వాస్థ్యమనగా నేమిటో మనకు సరియైన గ్రహింపు దయచేయునుగాక!

కీర్తనలు 106:4, 5 మరొకమారు చదివి, ఆ మాటలు మన జీవితములలో వాస్తవమగునట్లు అపేక్షించుదుముగాక! అంతకంతకు అధికముగా ఈ మూడింటికొరకు అనగా : తాను ఏర్పరచుకొనిన వారి క్షేమమును చూచి యానందించునట్లు, ఆయన స్వాస్థ్యమైన వారితో కూడి కొనియాడునట్లు మరియు నిత్యత్వమునందు ఆయనయు, మనమును ఒకటిగా కూడి ఆ స్వాస్థ్యమందుండునట్లు మన హృదయములు ఆశించునుగాక! ఆమేన్.